12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026
ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు
ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 28 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 3 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :28 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 3 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది

- నెల్లూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ
- కాలేజీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

- మిగతా 2లో

## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- 34 శాతం రిజర్వేషన్ల జీవో కేవలం రాజకీయ గిమ్మిక్కేనని బొత్స విమర్శ
- చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్
- సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మళ్లీ మోసగించడమేనని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా,

- మిగతా 2లో

## పరిశుభ్రత సామాజిక బాధ్యత..
# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు
- పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, అది సామాజిక బాధ్యత అని స్పష్టీకరణ
- చెత్తను సంపదగా మార్చే కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా, గోదావరి నదులు కలుషితమయ్యాయని విమర్శ
- రాష్ట్రంలో వర్షపాత లోటుకు పారిశుద్ధ్య లోపాలు కూడా ఓ కారణమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే

- మిగతా 2లో



## కరవుసీమ ఇకపై
# కనకసీమగా మారుతుంది

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య

**కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.**

పెన్ పవర్ డెస్క్:ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని

- మిగతా 2లో



### మీరు మా ఏపీ ముద్దుబిడ్డ"..
### అనంత్ అంబానీని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న చంద్రబాబు

- నన్ను ఏపీ బిడ్డగా చూడాలంటూ అనంత్ అంబానీ భావోద్వేగ ప్రసంగం
- ఎమోషనల్ గా స్పందించిన చంద్రబాబు
- కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి నిర్మల, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ భాగస్వామ్యం కావాలని సీఎం ఆకాంక్ష



## ఉచ్చు బిగిస్తున్న ఈడీ..
### వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డికి ఈడీ నోటీసులు
- ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని స్పష్టీకరణ
- రూ.40 కోట్ల డీల్‌పై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు
- గతంలో అవినాష్ రెడ్డి ఇంట్లో రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్న అధికారులు
- సీబీఐ ఛార్జిషీట్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ

పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ కోణంలో

- మిగతా 2లో

### పంజాబ్ సరిహద్దులో ఇద్దరు చొరబాటుదారులు
# హతం



- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు

- మిగతా 2లో

## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్



పెన్ పవర్ డెస్క్:రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న

- మిగతా 2లో



## హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా..
### మోదీతో వీడియోకాల్‌లో స్మిత్ భావోద్వేగం

పెన్ పవర్ డెస్క్: హైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో పరామర్శించారు. యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న మచ్చర్‌తో మోదీ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన అరోగ్య పరిస్థితి గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాక్‌పిట్‌లో తనకు ఎదురైన విపత్కర పరిస్థితి గురించి మోదీకి కెప్టెన్ స్మిత్

- మిగతా 2లో

## కండక్టర్‌గా సీఎం విజయ్..
### బస్సులో మహిళలకు స్వయంగా టికెట్ల పంపిణీ..

- తమిళనాడులో మహిళల ఉచిత బస్సు పథకం 'వెట్రి పయనం' విస్తరణ
- గాంధీ జయంతి సందర్భంగా పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు కూడా వర్తించనున్న ఉచిత ప్రయాణం
- ఈ పథకంతో రోజుకు 84 లక్షల మంది మహిళలకు ప్రయోజనం
- మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ పథకం వర్తింపు

- మిగతా 2లో



## ముంబైలో పోటాపోటీ నిరసనలు..
## సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్' ఆందోళన

- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన
- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్స్ట్ ముంబై' గ్రూప్ కౌంటర్ నిరసన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్త వాతావరణం
- సోషల్ మీడియాలోనూ ఇరువర్గాల మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం
- భారీగా మోహరించిన పోలీసులు, భద్రతా బలగాలు

- మిగతా 2లో



## అతడి నిమజ్జనం ఇంకా మిగిలే ఉంది

- జ్ఞానూ 'విసర్జన్' జరగాలన్న ప్రకాశ్ రాజ్
- సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణ
- సీఈసీ వైదొలిగేంత వరకు పోరాడాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు. దేశంలో గణేశుడి నిమజ్జనం పూర్తయిందని, కానీ జ్ఞానూ నిమజ్జనం ఇంకా మిగిలే ఉందని సీఈసీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఎల్ నినోలో వసంతకాలం

దక్షిణార్ధ గోళంలో వసంతకాలం మొదలైంది. చిలీలోని అటకామా ఎడారి సైతం పూలతో కళకళలాడుతోంది. భూమిపై అత్యంత పొడి ప్రాంతాల్లో ఒకటిగా పేరొందిన ఈ ఎడారిలో ప్రస్తుతం ఎటుచూసినా రంగురంగుల పూలే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఎడారిలోని లక్షలాది విత్తనాలు, మొక్కల దుంపలు మొలకెత్తి పూలు పూశాయి. వాటిలో కొన్ని దశాబ్దాలుగా నేలలోనే నిద్రాణంగా ఉన్నాయి."ఇది అరుదైన అద్భుతం. ఇక్కడ 200కు పైగా మొక్కల జాతులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పూలు పూసే తీరుతో పోలిస్తే ఈ దృశ్యం పూర్తిగా భిన్నం. అసాధారణమైనది" అని నేషనల్ ఫారెస్ట్ కార్పొరేషన్ (కోనాఫ్) రక్షిత ప్రాంతాల విభాగం అధిపతి జార్జ్ కారబాంటెస్ అసోసియేటెడ్ ప్రెస్‌తో చెప్పారు.పసిఫిక్ మహాసముద్రం, ఆండీస్ పర్వతాల మధ్య అటకామా ఎడారి విస్తరించి ఉంది. చిలీ ఉత్తర తీర ప్రాంతంలో సుమారు 1,600 కిలోమీటర్ల మేర వ్యాపించింది.

**చలికాలం నుంచి...**

చలికాలం నుంచి వసంతకాలంలోకి మారే సమయంలో ఇక్కడ పూలు పూయడం సాధారణమే. అయితే ఈ ఏడాది ఎడారిలోని గోధుమరంగు రాతి దిబ్బలు, ఇసుక మైదానాలు రంగురంగుల అడవి పూలతో నిండిపోయాయి. ఈ ప్రకృతి దృశ్యాన్ని స్థానికులు 'డియెసియెర్టో ఫ్లోరిడో' (పూలతో విరబూసిన ఎడారి) అని పిలుస్తారు."ఎడారి అంటే అంతా గోధుమరంగులోనే ఉంటుందని అనుకునేవాడిని. అదే నా మనసులో ఉన్న ఎడారి చిత్రం. ఇక్కడ భారీగా వర్షాలు కురిశాయని తెలుసు. అందమైన పచ్చదనాన్ని చూస్తానని భావించాను. కానీ ఇక్కడి దృశ్యం అద్భుతంగా ఉంది" అని చిలీలో పుట్టి, ఆస్ట్రేలియాలో జీవితమంతా గడిపిన 51 ఏళ్ల ఫెలిక్స్ బండా చెప్పారు. అటకామా ఎడారిని సందర్శించడం ఇదే తొలిసారి అని తెలిపారు.

**రికార్డు స్థాయి వర్షాలతో రంగుల హరివిల్లు...**

జులై, ఆగస్టు నెలల్లో చిలీలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. 1950వ దశకంలో వర్షపాతం కొలతలు ప్రారంభించినప్పటి నుంచి కొన్ని ప్రాంతాల్లో ఇంత భారీ వర్షాలు ఎప్పుడూ నమోదు కాలేదు. ప్రపంచ ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగేందుకు కారణమయ్యే 'సూపర్ ఎల్‌నినో' వాతావరణ పరిస్థితులు ఈ వర్షాలకు కారణమని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు."వర్షపాతం నమోదుచేయడం ప్రారంభించినప్పటి నుంచి చూస్తే.. కొన్ని ప్రాంతాల్లో 160, 180, 190 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పరిమాణం పరంగా ఇవి అత్యధిక గణాంకాలు" అని కోనాఫ్ అటకామా జీవవైవిధ్య పరిరక్షణ విభాగం అధిపతి, జీవశాస్త్రవేత్త సీజర్ పిజారో వివరించారు. ప్రస్తుతం చోటుచేసుకున్న ఈ పరిణామానికి కారణం 'సూపర్ ఎల్‌నినో' అని చెప్పారు.భారీ వర్షాల వల్ల చిలీలోని పలు ప్రాంతాల్లో వరదలు, తీవ్ర నష్టం సంభవించాయి. అయితే ఉత్తర ప్రాంతంలోని అటకామా ఎడారిలో మాత్రం పూలు విరబూసేందుకు ఈ వర్షాలు దోహదపడ్డాయి. ఈ ఏడాది సుమారు 17 వేల చదరపు కిలోమీటర్ల మేర ఎడారి పూలతో నిండిపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఇది చిలీలో అత్యధిక జనాభా నివసించే శాంటియాగో మెట్రోపాలిటన్ ప్రాంతానికి దాదాపు సమానం.

**కోనాఫ్ అంచనాల ప్రకారం...**

1997 తర్వాత అత్యంత విస్తృతంగా, తీవ్రస్థాయిలో పూలు విరబూసిన ఏడాదిగా 2026 నిలవనుంది.భారీ వర్షాలతో ఎడారిలోని జీవ పదార్థం క్రియాశీలమైందని పిజారో వివరించారు. దీనిని 'జెర్మ్‌ప్లాసమ్'గా పిలుస్తారు. ఇందులో విత్తనాలు, దుంపలతో పాటు వివిధ అకశేరుకాలు, సరీసృపాల గుడ్లు కూడా ఉంటాయి. తగినంత తేమ లభించడంతో ఇవి తిరిగి జీవక్రియలను ప్రారంభించాయి.ఫలితంగా ఎడారిలో 200కు పైగా మొక్కలు, పూల జాతులు కనిపిస్తున్నాయి. ఎరుపు, పసుపు రంగుల్లో నాన్యుకాస్, ఊదా రంగులో రాక్ పర్స్‌లేన్, తెల్లని సుస్పిరోస్, నారింజ రంగులో టెర్సియోపెలోస్ పూలు ఎడారికి కొత్త అందాన్ని తెచ్చాయి. స్థానికంగా కనిపించే 'గర్రా డె లియోన్' అనే మొక్క కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కొండలు, మైదానాలు, లోయలు పూలతో నిండిపోయాయి."30 నుంచి 40 ఏళ్లుగా పచ్చదనం, పూలు కనిపించని కొండలు, పర్వత ప్రాంతాల్లోనూ ఇప్పుడు పూలు విరబూశాయి. ఎడారిలోని ఈ విత్తనాలు, ఇతర జీవ పదార్థాలు ఎన్నో ఏళ్ల పాటు, ఒక్కోసారి దశాబ్దాల పాటు నిద్రాణంగా ఉండగలవు. ఈ ఏడాది కొండలపై కనిపిస్తున్న దృశ్యాలే అందుకు నిదర్శనం" అని పిజారో చెప్పారు.

**పర్యాటకుల సందడి...**

అటకామా ఎడారిలో పూలు విరబూయడంతో దేశీయ, విదేశీ పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జనసంచారం తక్కువగా ఉండే మారుమూల ప్రాంతాలకు వెళ్లి.. ఎడారి అంతటా విస్తరించిన లక్షలాది పూలను చూసి మురిసిపోతున్నారు. తీర ప్రాంతం నుంచి క్షితిజం వరకు పూలతో నిండిన దృశ్యాలను ఆస్వాదిస్తున్నారు.నవంబరులో ఈ ప్రకృతి దృశ్యం ముగిసేలోగా అటకామా ప్రాంతంలో దాదాపు 3 లక్షల రాత్రి బసలతో కూడిన పర్యటనలు నమోదవుతాయని జాతీయ పర్యాటక సచివాలయం అంచనా వేసింది. దీంతో ఈ సీజన్‌లో 'డియెసియెర్టో ఫ్లోరిడో' ఆ ప్రాంతంలోని ప్రధాన పర్యాటక ఆకర్షణల్లో ఒకటిగా నిలవనుంది.చిలీ మధ్య ప్రాంతంలోని కోల్‌చాగువా లోయలో ఉన్న శాంటా క్రూజ్ పట్టణానికి చెందిన చెఫ్ ఫ్రాంకో మోయా (37), తన ప్రేయసితో కలిసి అటకామా ఎడారిని సందర్శించారు. తన పుట్టినరోజు వేడుకల్లో భాగంగా దాదాపు వెయ్యి కిలోమీటర్లు (620 మైళ్లు) ప్రయాణించి ఎడారిలోని పలు ప్రాంతాలను చుట్టివచ్చారు."ఇంతటి పొడి ప్రాంతంలో పూలు ఎలా పెరుగుతున్నాయో చూడటం ఆశ్చర్యం కలిగించింది. ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఈ దృశ్యం నిజంగా నన్ను ఆశ్చర్యపరిచింది" అని ఫ్రాంకో మోయా చెప్పారు.

# హనుమాన్ చాలీసా చదివి ధైర్యం తెచ్చుకున్నా..

- మొదటి పేజి తరువాయి

వివరించారు. "అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో మీరు చూపించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీరు కోలుకోవాలని యావత్ భారతావని ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు.. ఇతరులను రక్షించడం కోసం తమ సొంత ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం గర్వంగా చెప్పగలదు" అని స్మిత్‌తో మాట్లాడుతూ మోదీ ఆయనను ప్రశంసించారు. మోదీ నుంచి ఫోన్ కాల్ రావడంతో స్మిత్ ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. "మీరు నాకు అత్యంత ఆరాధ్యమైన వ్యక్తి. మీ నుంచి కాల్ రావడం చాలా ప్రత్యేకంగా, గర్వంగా ఉంది. ఇది నేను కలలో కూడా ఊహించని క్షణం. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు నేను హనుమాన్ చాలీసాను పఠిస్తాను. కాక్‌పిట్‌లో ఘర్షణ సమయంలోనూ దాన్నే జపించా. ఆ సమయంలో నేను గాయపడినా దాని గురించి ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలు పోవొద్దనే ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి.. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని అర్థం చేసుకున్నా" అని ప్రధానికి తెలిపారు. అంతకుముందు స్మిత్ కుటుంబసభ్యులతో మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. ప్రస్తుతం స్మిత్ యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని అక్కడి భారత దౌత్యకార్యాలయం వెల్లడించింది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో ఈ దాడి ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కెప్టెన్ స్మిత్‌పై కో–పైలట్ దాడి చేసి ఆయనను తీవ్రంగా గాయపర్చారు. కత్తిపోట్లతో శరీరం నుంచి రక్తం ధారగా కారుతున్నా.. విమానం కూలకుండా చూసి ఎంతోమంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడగలిగారు స్మిత్. దీంతో ఆయనపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన హీరో అని, 9/11 లాంటి మారణహోమాన్ని నివారించారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కొనియాడారు.

# అతడి నిమజ్జనం ఇంకా మిగిలే ఉంది

- మొదటి పేజి తరువాయి

గాంధీ జయంతి సందర్భంగా సోషల్ మీడియాలో విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనలకు ఆయన మద్దతు పలికారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కాక్రోచ్ జనతా పార్టీ వంటివి ఢిల్లీ, ముంబైలలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయని.. ఈ శాంతియుత నిరసనల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని, సీఈసీ వైదొలిగే వరకు పోరాడాలని ప్రకాశ్ రాజ్ పిలుపునిచ్చారు.
ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ సవరణ ప్రక్రియ విషయంలో మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా పలుమార్లు అభ్యంతరాలు తెలిపినట్లు వార్తలు రావడం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 700 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోనూ భారీగా పోలీసులు మోహరించారు.

# మీరు మా ఏపీ ముద్దుబిడ్డ"..

"అనంత్ అంబానీ... మీరు ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం, ముఖ్యమంత్రి స్వయంగా ఆయన వద్దకు వెళ్లి అభినందించి, ఆప్యాయంగా హత్తుకోవడం సభలో ఉన్నవారిని ఆకట్టుకుంది.
అంతకుముందు, సభలో ప్రసంగించిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు.మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (+ఎఎ), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (xూూ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు.
ఇందులో రూ.40 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, మరో రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, ఆధునిక సాగు విధానాలు, ఎగుమతుల ప్రోత్సాహానికి బాటలు పడతాయని ప్రభుత్వం వివరించింది.
కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

- మొదటి పేజి తరువాయి

వివరించారు.ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్–2, వెలిగొండ ఫేజ్–2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు
ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

# గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్ - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.
స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు.
ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. "గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం" అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

# ఉచ్చు బిగిస్తున్న ఈడీ.. వివేకా హత్య కేసులో కీలక పరిణామం

- మొదటి పేజి తరువాయి

దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కడప వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. ఈ కేసులో రూ.40 కోట్ల డీల్ జరిగిందనే ఆరోపణలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది.వివేకా హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. 2025 ఆగస్టులో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేసింది. హత్య కోసం కుట్రదారులు సమకూర్చాలనుకున్న రూ.40 కోట్లు ఎక్కడి నుంచి తీసుకురావాలనుకున్నారు? అంత పెద్ద మొత్తాన్ని వారికి ఎవరు అందించారు? అనే కోణంలో ఈడీ ఆరా తీస్తోంది. అలాగే, హత్యలో పాల్గొన్న నిందితులకు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.4 కోట్ల నగదు మూలాలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేసింది. 2019 నుంచి నిందితులు, అనుమానితుల బ్యాంకు లావాదేవీలు, నిధుల కదలికలపై నిశితంగా పరిశీలిస్తోంది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఇప్పటికే పలువురిని విచారించింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఇతర నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిలను ప్రశ్నించి వారి నుంచి కీలక వివరాలు సేకరించింది. దీనికి కొనసాగింపుగా గతంలో ఆగస్టు 21న హైదరాబాద్, కడప జిల్లాల్లోని ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భాగంగా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసంలో లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదుతో పాటు రెండు లాకర్ల తాళాలు, కొన్ని కీలకమైన దస్త్రాలను కూడా అప్పట్లో సేకరించారు.గత సోదాల్లో లభించిన ఆధారాలు, ఇతర నిందితుల విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగానే తాజాగా అవినాష్ రెడ్డిని ప్రశ్నించాలని ఈడీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపు మార్గాలపై అవినాష్ రెడ్డి నుంచి వివరాలు రాబట్టే అవకాశం ఉంది. ఈ పరిణామంతో వివేకా హత్య కేసులో దర్యాప్తు మరోసారి కీలక దశకు చేరుకుంది.

# ముంబైలో పోటాపోటీ నిరసనలు.. సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ' ఆందోళన

ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు.వీరికి ప్రతిగా జెన్ నెక్ట్స్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు.
ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

# పరిశుభ్రత సామాజిక బాధ్యత.. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు.ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- మొదటి పేజి తరువాయి

కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు."రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లను వైసీపీ అడ్డుకుంటోందని టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని బొత్స మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడానికి బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సాకుగా చూపవద్దని హితవు పలికారు. బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంజాబ్ సరిహద్దులో ఇద్దరు చొరబాటుదారులు హతం

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారుల ను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి.అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

# కండక్టర్‌గా సీఎం విజయ్..

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని మరింత విస్తరించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నేడు 'వెట్రి పయనం' పేరుతో ఈ విస్తృత పథకాన్ని ఆయన ప్రారంభించారు. చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఇప్పటివరకు సాధారణ సిటీ, టౌన్ బస్సులకే పరిమితమైన ఈ పథకాన్ని ఇప్పుడు మరిన్ని సర్వీసులకు వర్తింపజేశారు. దీని ప్రకారం, ఇకపై మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో నడిచే ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్ (ఎల్ఎస్ఎస్), డీలక్స్ బస్సుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే 40 కిలోమీటర్లు దాటిన మొఫుసిల్ ఆర్డినరీ, కొండ ప్రాంతాల్లోని ఆర్డినరీ బస్సులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది.
ఈ విస్తరణతో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,692 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇది మొత్తం బస్సుల్లో సుమారు 69 శాతం. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ సుమారు 84.32 లక్షల మంది మహిళలు లబ్ధి పొందుతారని అంచనా వేస్తున్నారు.ఉద్యోగాలు, కళాశాలలు, ఇతర పనుల కోసం ప్రయాణించే మహిళల ఖర్చులను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. దీనికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాలపై పరిమితి గానీ లేదు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే, 'స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' (ఎస్ఈటీసీ) బస్సులకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇచ్చారు.

# వారణాసి గిరిధర శర్మ పౌర సన్మానం -ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబరు 02**

పట్టణంలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో అక్షర తపస్వి వారణాసి గిరిధర శర్మ అభినందన, పౌర సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని వారణాసి గిరిధర శర్మ ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, సంస్కృతి, భాషా పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్న అక్షర తపస్విని సత్కరించడం గిద్దలూరు ప్రజలకు గర్వకారణమని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో సాహిత్య, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్న ప్రముఖులను గౌరవించడం ద్వారా యువతకు స్ఫూర్తి కలుగుతుందన్నారు కార్యక్రమంలో ప్రముఖులు, సాహితీవేత్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# మహాత్ముని బాటలో కూటమి ప్రభుత్వం

**– పల్లె ప్రగతి, గ్రామ స్వరాజ్య సాధన రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి**

**– రూ. 40 లక్షల నిధులతో పునర్నిర్మించిన చారిత్రక చావిడి భవనం, నూతన గాంధీజీ విగ్రహం ఆవిష్కరణ**

**– గాంధీజీ సందర్శించిన పవిత్ర స్థలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం: ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 02**

జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు కనిన గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా, వారి అడుగుజాడల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు సెంటర్‌లో మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎమ్ఎఫ్ నిధులు రూ. 40 లక్షల వ్యయంతో నూతనంగా రూపుదిద్దుకున్న గాంధీజీ విగ్రహాన్ని, స్థానిక వ్యాపారులు, సీనియర్ సిటిజన్లు, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన నూతన చావిడి (రీడింగ్ రూమ్) భవనాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులు, అధికారులు ప్రారంభించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ... రెండేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము ఇక్కడికి వచ్చిన సమయంలో ఈ చారిత్రక చావిడి భవనం బాగా పాడైపోయి, విగ్రహం కూడా దెబ్బతిని ఉంది. నాడు ఇక్కడి వ్యాపారులు, పాత్రికేయులు, స్థానిక పెద్దలు విజ్ఞప్తి చేసిన వెంటనే, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో ఈ స్థలాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం గత ఏడాదే రూ. 40 లక్షల నిధులతో శంకుస్థాపన చేసి, సరిగ్గా ఏడాది కాలంలోనే పనులన్నీ పూర్తి చేసి, నేడు మూడో గాంధీ జయంతి నాటికి ఈ నూతన భవనాన్ని, విగ్రహాన్ని ప్రారంభించుకోవడం మా ప్రభుత్వ చిత్తశుద్ధికీ, ప్రజాప్రతినిధుల అంకితభావానికి నిదర్శనం అని హర్షం వ్యక్తం చేశారు. గాంధీజీ చూపిన అహింస, సత్యాగ్రహం, పరిశుభ్రత, ఖాదీ ప్రోత్సాహం, స్వదేశీ విధానాలే ప్రామాణికంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను, సర్పంచులను సర్వవిధాలా బలోపేతం చేస్తూ పల్లె ప్రగతికి శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబులి మాట్లాడుతూ... అక్టోబర్ 2 ఎంతో ప్రత్యేకమైన రోజు. సరిగ్గా ఏడాది క్రితం ఎమ్మెల్యే దామచర్ల , నేను ఈ ప్రాంగణాన్ని పరిశీలించి భవనం, విగ్రహ ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నాడు అనుకున్న పనులను సరిగ్గా ఏడాది పూర్తి అయ్యేసరికి ఇంత అద్భుతంగా కళ్లముందు ఆవిష్కరించుకోవడం నిజంగా గర్వకారణం. దీనికోసం శ్రమించిన ప్రజాప్రతినిధులు, అధికారులందరికీ నా అభినందనలు. మహాత్మా గాంధీజీ ఆశించిన 'గ్రామ స్వరాజ్యం' అంటే గ్రామంలోని ప్రజలే తమ సొంత అభివృద్ధికి మార్గదర్శకులుగా మారడం. ఆ దిశగా నేడు



దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను 'వికసిత్ భారత్' ప్రణాళికలతో ముడిపెట్టి ఎంతో ఘనంగా నిర్వహించుకుంటున్నాం. అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి, విబిజి రామ్జీ అభివృద్ధి పనులన్నిటినీ అనుసంధానిస్తున్నాం అన్నారు. గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి, ప్రజలు తమకు ఏమేమి కావాలో స్వయంగా నిర్ణయించుకునే హక్కును, మార్గాన్ని ఈ గ్రామసభల ద్వారా సుగమం చేస్తున్నాం అని సమగ్రంగా వివరించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ... ఈ పవిత్రమైన రోజున మన జాతిపిత మహాత్మా గాంధీజీ నూతన విగ్రహాన్ని, అలాగే పునర్నిర్మించిన చారిత్రక చావిడి భవనాన్ని ప్రారంభించుకోవడం ఎంతో శుభపరిణామం. మహాత్ముడు ఎటువంటి మహోన్నత స్ఫూర్తితో, అహింసా మార్గంలో మన దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారో, ఎటువంటి నైతిక విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారో మనందరికీ తెలుసు. వారి వెంటే నడిచి అనేక మంది అమరవీరులు, మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేసి ఈ స్వతంత్ర సమాజాన్ని మనకు అందించారు. అటువంటి మహనీయులు నిర్మించి ఇచ్చిన ఈ సమాజాన్ని, మన జాతిపిత ఆశయాలకు, వారి గొప్ప వ్యక్తిత్వానికి అనుగుణంగా ప్రగతిపథంలో నిర్మించాల్సిన గురుతర బాధ్యత మనందరిపైనా ఉంది" అని పిలుపునిచ్చారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ... ఒంగోలు నగర చరిత్రలో గాంధీ రోడ్డు సెంటర్‌కు ఒక ప్రత్యేకమైన ప్రాశస్త్యం ఉందన్నారు. 1998లో తాను మొదటిసారి ఎంపీగా గెలిచిన నాటి నుండి ప్రతి ఏటా అక్టోబర్ 2న ఇక్కడికి రావడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. "జాతిపిత గాంధీజీ స్వయంగా ఒంగోలు వచ్చి, ఈ చావిడి ప్రాంగణంలో కూర్చొని విశ్రాంతి తీసుకున్న అరుదైన చారిత్రక నేపథ్యం ఈ ప్రదేశానికి ఉంది. పూర్వం విఆర్‌ఓ ఆఫీస్‌గా ఉండి, కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని ఎలాగైనా పునర్నిర్మించాలని ఎప్పటినుంచో తపన పడ్డాం. ఈ క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఇంచార్జ్ మంత్రి ఆమోదంతో రూ. 40 లక్షల డిఎమ్ఎఫ్ నిధులు మంజూరు చేయించాం. కేవలం భవనమే కాకుండా నిత్యం తిరిగే వేలాది మంది కస్టమర్లు, స్థానిక వ్యాపారులు, పెద్దలు కూర్చుని దినపత్రికలు చదువుకోవడానికి వీలుగా ఎయిర్ కండిషనర్ (ఏసీ), వాష్ రూమ్, ఫర్నిచర్ వసతులతో ఒక మోడల్ రీడింగ్ రూమ్‌గా దీనిని తీర్చిదిద్దడం ఎంతో సంతోషాన్నిస్తోంది అని తెలిపారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ... 1869 అక్టోబర్ 2న జన్మించిన గాంధీజీ, అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పాత బొమ్మ కూలిపోయేలా ఉందనే భయంతో ఉన్న స్థానికులకు, ఇప్పుడు ఆధునిక నమూనాతో రూ. 40 లక్షలతో అత్యంత సుందరమైన గాంధీజీ విగ్రహాన్ని, ఏసీ రీడింగ్ రూమ్ భవనాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వ్యాపార కూడలి అయిన ఈ ప్రాంగణంలో ఏదైనా సమస్య వచ్చినా, వ్యాపారులు కూర్చొని మాట్లాడుకోవడానికి, ప్రశాంతంగా పేపర్లు చదువుకోవడానికి ఈ చావిడి భవనం నిలయంగా మారుతుందన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... "ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మనమందరం ఈ చారిత్రక ప్రదేశంలో కలుసుకోవడం ఒక మంచి సంప్రదాయంగా వస్తోంది. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసి, నగరంలోని ప్రధాన కూడలి అయిన గాంధీ రోడ్డు సెంటర్‌లో జరిగిన ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. నియోజకవర్గాల సరిహద్దులకతీతంగా మనమందరం కలిసికట్టుగా గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. జాతిపిత ఆదర్శాలు, వారి స్ఫూర్తి ఎప్పటికీ మనందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయి. ఒంగోలు నగరంలో స్థానిక ప్రజలకు, వ్యాపారులకు ఎంతో అనువుగా రూ. 40 లక్షల నిధులతో నూతన విగ్రహాన్ని, వసతులతో కూడిన ఏసీ చావిడి భవనాన్ని పునర్నిర్మించి అందుబాటులోకి తెచ్చిన ప్రజాప్రతినిధులను, అధికారులను అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ రియాజ్,డి ఆర్ ఓ వెంకటరమణ ,జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపార ప్రముఖులు, నాయకులు, నగర ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలి

**– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

**– ఎన్నికల నిర్వహణకు పాటించాల్సిన నిబంధనలు, విధి విధానాలు, ముందస్తు చర్యలపై పోలీసులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ**



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 02**

రానున్న మునిసిపల్ ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ఏ సమయంలో ఎన్నికలు నిర్వహించినప్పటికీ జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక/అతి సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పోలీస్ శాఖ తీసుకోవాల్సిన భద్రత చర్యలు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలో, శాంతిభద్రతలను పరిరక్షించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, అలవాటుపడిన నేరస్తులు, డీసీ/హెచ్ఎస్ షీట్ కలిగినవారు, చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పరిశీలించాలని తెలిపారు. గత ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడిన వారిని ముందస్తుగా బైండోవర్ చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. పల్లెనిద్ర, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వార్డులు, లొకేషన్లు, పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీసులు కలిగి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. గతంలో ఎన్నికల సమయంలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియా కూడాపై కూడా నిఘా ఉంచాలన్నారు. రాబోవు ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపించేలా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడిన దగ్గరనుండి ఎన్నికలు పూర్తిస్థాయిలో ముగిసే వరకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధన మేరకు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, ఎక్కడ ఎటువంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ బాలమురళి కృష్ణ, కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం, జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరిని ఘనంగా సన్మానించిన టీం ఐఎన్ఆర్






**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 2**

మున్సిపాలిటీకి సంబంధించి, హైకోర్టులో వేసిన పిటిషన్ ను రద్దు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీకి త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయివైసీపీ కుట్రలు, కుతంత్రాలను ధీటుగా ఎదుర్కొని, ఎన్నికల సమరానికి శ్రేణులను సమాయత్తం చేస్తున్న శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కి కందుకూరు పట్టణానికి చెందినటీం ఐఎన్ఆర్ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ ఈరోజు టిడిపి కార్యాలయంలో ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. శాసనసభ్యుల వారి నాయకత్వంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని ఇంటింటికీ తిరిగి వివరించి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ రాబోయే ఎన్నికల్లో, అన్ని వార్డులలో విజయ కేతనం ఎగురవేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు నల్లూరి సూర్యనారాయణ, అత్తంటి శివకృష్ణ, నాదెండ్ల మధు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు నవిడిబోయిన వెంకటకృష్ణ, చుంచు వేణు, గుమ్మా శివ, భవనాసి వెంకటేశ్వర్లు, మచ్చా మనోహర్, పీలా శ్రీను, నీలిశెట్టి శివరామకృష్ణ పాల్గొన్నారు.

# జిల్లాలోని ఉద్యాన రంగానికి ఊతం

**– మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి**

**– లక్ష కోట్ల వ్యయం తో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్**

**– వర్చువల్ ద్వారా వీక్షించిన మంత్రి స్వామి, కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 02**

రాయలసీమ సమగ్ర ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని ఉద్యాన రంగానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శుక్రవారం మదనపల్లిలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేసి, రూ. లక్ష కోట్ల వ్యయంతో ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రకాశం భవనం నుంచి మంత్రితో పాటు కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 32,702 హెక్టార్ల ఉద్యాన విస్తీర్ణం ఉండగా ఈ కార్యక్రమం ద్వారా అదనంగా 27,156 హెక్టార్ల విస్తీర్ణాన్ని అభివృద్ధి చేయటం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు. పంటల వైవిధ్యం, నీటి వినియోగ సామర్థ్యం పెంపు, తోటల ఉత్పాదకత పెంపు, నాణ్యత అభివృద్ధి, పంట కోత అనంతర కష్టాలు తగ్గింపు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతంపై ఈ కార్యక్రమంలో ద్వారా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. మిరప పంటలో నాణ్యత, మంచి వ్యవసాయ పద్ధతులు, అవశేషాల నియంత్రణ, ఉత్పత్తి గుర్తింపు, ఎగుమతులకు అనుకూలమైన ఉత్పత్తి విధానాలను ప్రోత్సహించడంతోపాటు మామిడి, ఇతర తోటల్లో ఆధునిక పర్యవేక్షణ, నాణ్యమైన ఉత్పత్తి, మార్కెట్ అనుసంధానాన్ని అభివృద్ధి చేయటం వంటి కార్యక్రమాలను ఇందులో ప్రతిపాదించినట్లు మంత్రి వివరించారు. వీటికోసం రూ.601 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం చేస్తుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 10 ఉద్యాన క్లస్టర్లు, 35 మండలాలు ఈ కార్యక్రమంలో లబ్ధి పొందుతాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే మార్కాపురం, ప్రకాశం జిల్లాలకు నీటి సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం, తాజాగా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింతగా పెంచి సుస్థిరం చేసేందుకు ఈ పథకం ద్వారా దృష్టి పెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో పి.వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపి పి.డి. శ్రీనివాసులు, ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్. వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.



# పేదలకు ఉపాధి కల్పించడం లక్ష్యం

**– జిల్లా కలెక్టర్ రాజాబాబు – మహోన్నతుడు మహాత్మా గాంధీ**

**– ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్**



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 02**

జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు దానికి గుర్తుగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కార్యక్రమాన్ని ప్రారంభించారని జిల్లా కలెక్టర్ పి రాజబాబు తెలిపారు. శుక్రవారం ఇనమనమెల్లూరులో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ ఇజిఎస్ పనులను విబి జి రాంజీ పనులు గా రూపాంతరం చేసి పని దినాలను పెంచారని అన్నారు. అంతే కాకుండా వివిధ పనులను అందులో పొందుపరిచారని అన్నారు. సిసి రోడ్లు డ్రైన్లు , నీటి తొట్టిలు ఏర్పాటు తదితరాలు ఉన్నాయన్నారు. జల ధార జలహారతి కార్యక్రమం ద్వారా కాలువలను వాటర్ రిసోర్స్ లకు అనుసంధానం చేయడం జరిగింది అన్నారు. ప్రతి ఒక్క పేదవానికి పనులు కల్పించడమే ముఖ్య ఉద్దేశ మని కన్వర్జెన్స్ మోడల్గా చేసి పనికి ఆహార పథకం ప్రారంభించడం జరిగిం దన్నారు. వికసిత భారత లక్ష్యంగా ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ సభలో గ్రామస్తుల మధ్య సమస్యలు తెలుసుకుని తద్వారా పరిష్కారం చూపడం జరుగుతుందని గ్రామస్తులు సూచనలు మేరకు వారి అంగీకారం మేరకు పలు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు బి.ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో గాంధీ మహాత్ముని త్యాగాలు గొప్పవని ఆనాటి నుండి దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ముందుకు సాగాయని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో వి బి జి రాంజీ పనుల ద్వారా చాలా పనులు చేపట్టడం జరిగిందన్నారు. వి బి జి రాంజీ పథకం ఉద్దేశం పని లేని వారికి ఉపాధి కల్పించడం, రోడ్లు మరమ్మతులు చేయడం జరిగిం దన్నారు. గొర్రెల షెడ్లు ఏర్పాటు పశువులకు నీరు అందించడం వంటి చర్యలు చేపట్టడం జరిగిం దన్నారు. ఉపాధి హామీ పనులతో పాటు ఉపాధి కల్పించడం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం పనులకు ఆమోదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహ ణాధికారి చిరంజీవి, డిఆర్డిఏ పిడి నారాయణ, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తొలుత మహాత్మా గాంధీ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 2**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి.వి. గురునాథం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, స్థానికులు హాజరై మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ సేవలను స్మరించుకుంటూ పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సత్యం, అహింస అనే ఆయుధాలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన పాటించిన సత్యం, అహింస, శాంతి, సహనం వంటి విలువలు నేటి సమాజంలో మరింత అవసరమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొనే విభేదాలు, సమస్యలను హింసకు





తావులేకుండా శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యత, పరస్పర గౌరవం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువత గాంధీజీ జీవిత చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలను తెలుసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను, దేశానికి అందించిన విశిష్టమైన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కోర్లకుంట జానకీ రఘు, ఉప్పల హనుమంతు, మాజీ వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు, మాజీ ఎంపీటీసీ ఇదెమ్మ, రామదాసు, డాక్టర్ మల్లిఖార్జున్, కుడుముల లాలయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, నాయకులు, స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు.

## రగ్బీలో రాష్ట్రస్థాయికి జెడ్పీ బాలికల స్కూల్ విద్యార్థినులు




**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 2**

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రగ్బీ క్రీడలో సత్తా చాటారు. అండర్-19, అండర్-17, అండర్-14 విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై పాఠశాలకు పేరు తెచ్చారు. పదవ తరగతి విద్యార్థిని మౌనిక, 9వ తరగతి విద్యార్థినులు అనూష, మణి, 7వ తరగతి విద్యార్థిని కేశమ్మ రగ్బీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పిన్నిక జాహ్నవి ప్రియ, పీఈటీ రోహిణి తెలియజేశారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శ్రీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. విద్యార్థినులను రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటాం

### - మంత్రి డాక్టర్ డోలా



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 02**

ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఐజెయు పిలుపులో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా ఒంగోలులో జర్నలిస్టుల డిమాండ్స్ వినతి పత్రాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కు అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి నివాళులర్పించి జర్నలిస్టులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి డోలా జర్నలిస్టులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కారానికి తాను సిఫారసు చేస్తానని, రాష్ట్ర పరిధిలో ఉన్న వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి.. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వినతి పత్రంలో పేర్కొన్న డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఆలుగుల సురేష్, జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొలకలూరి విజయ్, కెమెరామెన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు షేక్ ఇఫ్తేకర్ బాషా, సామ్నా జిల్లా నాయకులు బంగి లింగరాజు, రంగన్న, కోటిరెడ్డి, సుబ్బారావు, ప్రతాప్, శ్రీనివాసరావు, రాజు, ప్రైమ్ 9 శీను, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

### ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలి

### అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నందు మహాత్మా గాంధీకి నివాళులర్పించి ,నిరసన మహాత్మా గాంధీకి వినతిపత్ర



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**

అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ గిద్దలూరు ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు డి స్వర్ణ , ఏ మునెమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన నేటికీ అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని,. అతి తక్కువ వేతనంతో తీసుకొని పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని అన్నారు. అర్హులైన అంగన్వాడి వర్కర్లకు సంక్షేమ పథకాలు వితంతువు, వృద్ధాప్య, వికలాంగుల, ఒంటరి మహిళ పెన్షన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అప్లై చేస్తే ప్రభుత్వ ఉద్యోగులని సంక్షేమ పథకాలు రాకుండా రిజెక్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా మాకు ఏమైనా వేతనాలు ఇస్తున్నారా మేం తీసుకునేది గౌరవేతనం మాత్రమేనన్నారు. అంగన్వాడి వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనాలు అమలు చేయాలి లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలను కూటమి ప్రభుత్వం తిలోదాకాలిచ్చింది

### -వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 2**

బ్రిటిష్ ముష్కరుల కబంధహస్తాల నుండి భారత దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహాత్మా గాంధీ మరువలేని నాయకుడని,ఆయన ఆశయాలు గొప్పవని, నేడు కూటమి ప్రభుత్వం గాంధీజీ ఆశయాలను తిలోదా కాలిచ్చిందని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధిస్తూ ఆయన ఆశయాలు నెరవేరుస్తూ జగనన్న ప్రభుత్వంలో ప్రతిపథకం ప్రతి గడపకు, ప్రతి గ్రామానికి అందించారని, సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోనే పరిపాలన అందిస్తే, కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు గ్రామ స్వరాజ్యాన్ని చిదిమెసాడనిఅన్నారు. ప్రభుత్వం నుండి నేరుగా గ్రామాలకు ప్రజలకు అందించే పథకాలు తీసేసాడని గాంధీజీ స్ఫూర్తికి వ్యతిరేకంగా కూటమి పరిపాలన చేస్తున్నారని, నేడు రాష్టం కుట్రలు, కుతంత్రాలు, హత్యలకు నిలయంగా మారిపోయిందని అన్నారు. అహింస, శాంతియుత మార్గంలో పాలన సాగలానే గాంధీజీ ఆశయ స్ఫూర్తితో కూటమి పాలన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్, మండల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి,జడ్పీటీసీ చేదూరివిజయ భాస్కర్, నాయకులు కొప్పర్తి ఓబుల్ రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జబివుల్లా, ఎస్టీ సెల్ నాయకులు రాములు నాయక్, వాణిజ్య విభాగం నాయకులు సురే శ్రీనివాసులు, జిల్లా సెక్రటరీ సింగా ప్రసాద్, వైస్సార్సీపీ ఆర్య వైశ్య నాయకులు సురే రమేష్, కందూరి గురు ప్రసాద్,ఇమ్మడి శెట్టిసత్యనారాయణ,కాకుమాను వెంకట సురేష్ బాబు, సురే వెంకట స్వామి,యక్కలి రాంబాబు,మహిళ నాయకులు రామావత్ అరుణ భాయ్, పల్లె సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా పదవీ విరమణ చేసిన నాగరాజు యాదవ్ కు ఘన సన్మానం

### బీసీ సంఘాలు, సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు

### న్యాయానికి నిలబడిన అధికారిగా ప్రశంసలు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 2**

మార్కాపురం డీఎస్పీగా పదవీ విరమణ చేసిన ఉప్పుటూరి నాగరాజు యాదవ్ కు మార్కాపురం జిల్లా బీసీ సంఘాల ఆధ్వర్యంలో, వివిధ సేవా సంస్థల సమన్వయంతో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరుకు చెందిన జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మేకనబోయిన గురు ప్రసాద్ యాదవ్ అధ్యక్షత వహించిన ఈ సభలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ నాగరాజు యాదవ్ సేవలను కొనియాడారు.

**10 రోజుల్లో బీసీ సర్పంచ్ కు న్యాయం చేశారు- పీఎల్పీ యాదవ్**

ఎస్సైగా ప్రస్థానాన్ని ప్రారంభించిన నాగరాజు యాదవ్ ఉద్యోగం చేసిన ప్రతి చోటా తనదైన శైలిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజల మన్ననలతో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా అందుకున్నారు. గిద్దలూరు ఎస్సైగా ఉన్న రోజుల్లో రాచర్ల మండలంలో ఒక బీసీ సర్పంచ్ అన్యాయంగా ఇబ్బందులు పడినప్పుడు ఉమ్మడి రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు బుర్ర పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మేము అప్పటి ఎస్పీ సింహా ని కలిసి విన్నవించాము. దీంతో విచారణాధికారిగా నాగరాజు యాదవ్ ని నియమించారు. కేవలం 10 రోజుల వ్యవధిలోనే సదరు సర్పంచ్ కు ఎలాంటి సంబంధం లేదని, నేరారోపణ సరికాదని తేల్చి న్యాయం చేశారు. ఆ సంఘటనను యాదవ సంఘాల్లో ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. చీరాల వంటి విభిన్న ప్రాంతాల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ అన్ని పార్టీల ప్రశంసలు పొందారుఅని పీఎల్పీ యాదవ్ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలు కీలక పట్టణాలలో ఎస్సైగా, సీఐగా, స్పెషల్ బ్రాంచ్, ఒంగోలు, రాజమండ్రి డీఎస్పీలుగా పని చేస్తూ చివరిగా మార్కాపురం డీఎస్పీగా పార్టీలకు అతీతంగా హుందాగా వ్యవహరించారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని వైట్ మెటల్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాలెం చెంచయ్య, డాక్టర్ దర్శి రామకృష్ణ, ఇల్లూరి రంగస్వామి గౌడ్, పిన్నిక నాగార్జున, నల్లబోతుల శ్రీనివాస్, దూదేకుల ఆదాం, మాజీ సైనిక అధికారి ఎం. చిన్నయ్య, గోసు వెంకట సుబ్బారావు, డాక్టర్ సయ్యద్ మక్బూల్ బాషా, మీర్జా షంషేర్ అలీ బేగ్, నటుకుల శ్రీనివాసరావు, ఎన్వీ రమణ, చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎన్జీవో, లయన్స్ క్లబ్, యుటిఎఫ్, సాయి మందిర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

### బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**

జాతిపిత మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గిద్దలూరులో బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత మాట్లాడుతూ, మహాత్మా గాంధీ సత్యం, అహింస, శాంతి మార్గాలతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు. దేశానికి "జై జవాన్--జై కిసాన్" నినాదాన్ని అందించిన లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, నిజాయతీ, ధైర్యం, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అధికారం అంటే హోదా కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని శాస్త్రి తన జీవితంతో నిరూపించారనన్నారు. "ప్రస్తుత రాజకీయాల్లో గాంధీజీ సత్యనిష్ఠ, శాస్త్రిజీ నిరాడంబరత అత్యంత అవసరం. పదవుల కోసం రాజకీయాలు చేసే నాయకులు కాకుండా, ప్రజల కోసం పనిచేసే సేవకులు దేశానికి కావాలని బడుగు, బలహీన, బీసీ వర్గాలకు సామాజిక న్యాయం అందించడమే మహనీయులకు మనం అర్పించే నిజమైన నివాళి" అని జాడి శ్వేత అన్నారు. యువత మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేసి, క్రమశిక్షణ, నిజాయతీ, సేవాభావం, దేశభక్తిని అలవరచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్ప్రింగ్ బోర్డ్ స్కూల్ డైరెక్టర్ పి.మణి చైతన్య, గిద్దలూరు పట్టణ బి.సి.సంక్షేమ సంఘం అధ్యక్షుడు అద్దంకి. మధుసూధనరావు,శాలివాహన సంఘ నాయకులు దగ్గుపాటి. శేఖర్, నాగేళ్ల.వెంకట మోహన్,విశ్వబ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు బంగారు. శ్రీనివాసాచారి,గలిజెరుగుళ్ల.విశ్వరూపాచారి,నాయి బ్రాహ్మణ సంఘ సెక్రటరీ రావిపాటి. నాగరాజు,రజక సంఘ వైస్ ప్రెసిడెంట్ అలసంద లపల్లె. పాండు, బి.సి. నాయకుడు కోడె.అల్లురయ్య యాదవ్, పలువురు బీసీ సంఘ నాయకులు,బి.సి. మహిళా నాయకులు పాల్గొన్నారు.



## మహాత్ముని ఆదర్శాలను అనుసరించాలి

### - జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

### - జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎస్పీ



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 02**

భారత స్వాతంత్ర్యోద్యమంలో మహనీయుడు, అహింసావాది, జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు.. పోలీస్ అధికారులు ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారిని ఎదిరించి, శాంతియుతంగా పోరాడి భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించి, ప్రపంచ చరిత్రలో గొప్ప వ్యక్తిగా, జాతిపితగా నిలిచారని అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి ఉద్యమాల్లో యావత్ దేశ ప్రజల్లో స్వరాజ్య స్ఫూర్తిని రగిలించారని, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన మార్గం, సేవలు, ఆశయాలను మనమందరం స్మరించుకోవాలన్నారు. బాపూజీ జీవితం, ఆయన ఆదర్శాలు సత్యం, అహింస, ధర్మ మార్గాలు ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయని, మహాత్ముని బోధనలు, ఆదర్శాలు, జీవిత విలువలను అనుసరిస్తూ శాంతి, సమానత్వం, మతసామరస్యాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని, ఆయన కలలు కన్న దేశాన్ని రూపొందించడానికి మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అహింసాయుత పద్ధతి ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన గొప్ప దేశభక్తుడు జాతిపిత మహాత్మా గాంధీ

### కసినేపల్లిలో ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు




**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 2.**

భారతదేశ శాంతి ద్వారా స్వాతంత్రాన్ని సాధించిపెట్టిన గొప్ప దేశభక్తులు జాతిపిత మహాత్మా గాంధీ అని కసినేపల్లి ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బిజ్జం చిన్న నరసయ్య పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతిని పురస్కరించుకొని కసినేపల్లిలోని ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా డాక్టర్ చిన్న నరసయ్య మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రాన్ని సాధించి పెట్టడంలో మహాత్మా గాంధీ చేసిన కృషి, పోరాటాలు మరువరానివని అన్నారు. ప్రతి భారతీయుడు మహాత్మా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని, అప్పుడే జాతిపితకు ఘన నివాళులర్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కసినేపల్లిలోని పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు శుక్రవారం నుండి ప్రతిరోజు ఉదయం ఫలహారం, సాయంత్రము స్నాక్స్ తో పాటు ఉచితంగా ట్యూషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు. ఆ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త దీవెనమ్మ ఆయా కుమారి తో పాటు ఆశ కార్యకర్తలు వయోజన వృద్ధులు గ్రామ పెద్దలు, ఆ గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇనమనమల్లూరు గ్రామ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

## - జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎస్ ఎన్ పాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ల హామీ





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 02**

మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు సచివాలయంలో పల్లె నిద్ర కార్యక్రమం అనంతరం శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, స్థానిక శాసనసభ్యులు విజయ కుమార్ తో కలిసి గురువారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామస్తులు లేవనెత్తిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుట లో భాగంగా తొలుత జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆకతాయి లు ఎవరు పిల్లలను ఇబ్బంది పెట్టకుండా ఉండే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని లేనిచో అటువంటి ఆకతాయిలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం చెరువును పరిశీలించి అందులో జరుగుతున్న విబిజి రాంజీ పనులను పరిశీలించారు. చెరువుకు సంబంధించిన సమస్యలపై ఒక పరిశీలన అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వేసి ఘన నివాళు లు అర్పించారు. గ్రామస్తులకు మంచినీటిని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. పశువులకు నులి పురుగుల నివారణకు వేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. పల్లెనిద్ర కార్యక్రమం అనంతరం ఎఫ్ బి సి ఎంపీ నగర్ ఎస్టి కాలనీలో పర్యటించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన పరువు సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ప్రధానంగా ఉన్న ఎస్టీలకు జీవనోపాధి నిమిత్తం చేపలు పట్టుటకు లైసెన్సులు మంజూరు చేయడం జరుగుతుందని, అదే విధంగా స్మశాన వాటిక ఏర్పాటుకు గుండ్లకమ్మ వాగుకు సంబంధించి పోరంబోకు భూములను వెరిఫై చేసి అదే విధంగా దాతలు సహకారంతో స్మశాన వాటికి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంచినీటి సమస్యను తీర్చే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పంచాయతీలో నిధులు వెసులుబాటును బట్టి వీధి దీపాలు ఏర్పాటు చేయుటకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు విజయకుమార్ మాట్లాడుతూ రాత్రి ఇనమ మెల్లూరులో పల్లెనిద్ర తర్వాత ఉదయం కలెక్టర్ పి రాజబాబు తో కలిసి ఎస్టి కాలనీ సందర్శించడం జరిగిందన్నారు. ప్రధానంగా గ్రామస్తులు లేవనెత్తనపల్లి అంశాలను పరిష్కరించడం. మంచినీటి వసతి, స్మశాన వాటిక ఏర్పాటు వీధి దీపాలకు తగిన చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ఇంకొక ఐదు లక్షలు రూపాయలు వెచ్చించి రోడ్లను మరమ్మతులు చేయడం ద్వారా ఎస్టి కాలనీ కు రోడ్డును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను ప్రజల ముంగిటికే వచ్చి సమస్యలు పరిష్కరించడం పల్లె నిద్ర గ్రామసభ ముఖ్య ఉద్దేశం అన్నారు. పి4 విధానం ద్వారా రైతులు కు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని తద్వారా పేదలకు ఇంటి స్థలాలు స్థలాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావు, డి ఆర్ డి ఎ పి డి నారాయణ, ఐసిడిఎస్ పిడి, పద్మ సునంద, డి ఎం ఐ హెచ్ ఓటి. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక మానసిక దారుఢ్యం

**- విశ్రాంత ఐపిఎస్ అధికారి కాకుమాను రాజ శిఖామణి**

**- ఒంగోలులో ఘనంగా**

**జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ సెలక్షన్స్**

**- 400 మంది క్రీడాకారుల హాజరు**





**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 02**

ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17, అండర్-19 బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధి నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఎస్పీ కాకుమాను రాజ శిఖామణి మాట్లాడుతూ, ఫుట్‌బాల్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడల్లో ఒకటని అన్నారు. ఫుట్‌బాల్ ఆడటం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక చురుకుదనం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, పోరాట పటిమ పెంపొందుతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, శారీరక సామర్థ్యం పెరుగుతాయని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పి. శివశంకర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించేలా అవకాశాలు కల్పించేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కృషి చేస్తోందన్నారు. మహిళా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రాజ్యలక్ష్మి, డివిజన్ కోఆర్డినేటర్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమినేని సురేష్, మాజీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి వై. సీనయ్య, శాప్ ఫుట్‌బాల్ కోచ్ పాల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రూథర్, బిన్నీ ఫయాజ్, విజయ్ కుమార్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఎంపికలకు హాజరైన క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించేందుకు రైజ్ కళాశాల యాజమాన్యం సహకారం అందించింది.

# ఘనంగా ప్రభుత్వ పాఠశాలలో గాంధీ జయంతి వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి గొట్టిపాటి**

**గాంధీ జయంతి సందర్భంగా**

**మొక్కలు నాటిన విద్యుత్ శాఖ మంత్రి**






**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 02**

సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ వేమవరపు కోటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలననుండి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు మహాత్మా గాంధీ అని పేర్కొన్నారు. పాఠశాలలను మౌలిక వసతులు, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో గాంధీ తాత యొక్క గొప్పతనాన్ని వివరించారు. తెల్లజాతీయులు భారతీయులపై చేస్తున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని ఎంఈఓ ఎంఆర్ కోటేశ్వరరావు కొనియాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ ఎలీషా, విద్యార్థులు, గ్రామస్తులు, తెదేపా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి వారి దేవాలయ నిర్మాణానికి విరాళం

**డాక్టర్ ఆకుల నగేష్**

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**



ముండ్లపాడు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి వారి దేవస్థాన నిర్మాణానికి , ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆకుల నాగేష్ నియోజకవర్గం, భారతీయ జనతా పార్టీ బి ఎల్ ఏ 1 ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆకుల నగేష్ ముండ్లపాడు గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి వారి దేవస్థానము పేరు మీద ఉన్న అకౌంట్ శుక్రవారం ల జమ చేశారు. అయ్యప్ప స్వామి వారి కృపా కటాక్షాలు దాత కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని, వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**గడియార స్తంభం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టర్**

**ఎస్పీ కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ**





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 2**

నూతన మార్కాపురం జిల్లా కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని గడియార స్తంభం వద్ద గల గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యం, సేవా భావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. గాంధీజీ సేవలను, దేశానికి ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, తహసీల్దార్ కే. చిరంజీవి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ..**

మార్కాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఐపీఎస్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ చూపిన అహింస, సత్యం, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఓ ఎస్ డి నవజ్యోతి మిశ్రా ఐపీఎస్, సీఐ అల్తాఫ్ హుస్సేన్, పోలీసు సిబ్బంది పాల్గొని గాంధీజీకి నివాళులు అర్పించారు.

**డీఆర్వో శ్రీదేవి ఆధ్వర్యంలో..**

మార్కాపురం కలెక్టరేట్ ఆడీఆర్వో శ్రీదేవి ఆధ్వర్యంలోవరణలోని గాంధీ విగ్రహానికి గురువారం గాంధీ జయంతి సందర్భంగా అధికారులు ఘన నివాళులు అర్పించారు. డీఆర్వో శ్రీదేవి ఆధ్వర్యంలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ ఆశయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు అందరు కృషి చేయాలి

**గ్రామ స్వరాజ్యం, పరిశుభ్రత, స్వయం సమృద్ధి, తదితర ఆశయాలను నెరవేర్చాలి**

**రాజుపాలెం పంచాయతి స్పెషల్ ఆఫీసర్ వీరయ్య సూచనల సలహాలు**





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 2**

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని కొమరోలు మండలం రాజుపాలెం గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి,కొమరోలు మండల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఈరయ్య పేర్కొన్న కోరారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాజుపాలెం లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఈరయ్య తోపాటు స్వర్ణ గ్రామ సిబ్బంది జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఈరయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాలైన గ్రామ స్వరాజ్యం,పరిశుభ్రత, స్వయం సమృద్ధి,ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి తదితర ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే జాతిపిత మహాత్మా గాంధీకి నిజమైన నివాళు లు అర్పించినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఆ సందర్భంగా ఆయన మహాత్మా గాంధీ భారతదేశ స్వాతంత్ర సమపార్జనకు అహింసాయుత పద్ధతుల ద్వారా చేసిన కృషిని, చేసిన త్యాగాలను, పడిన కష్టాలను వివరించారు. ఆ కార్యక్రమంలో వికసితభారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆర్జీవిక మిషన్ పథకానికి సంబంధించిన అధికారులు పాల్గొని రైతులకు పథకం గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ కార్యక్రమంలో రాజుపాలెం పంచాయతీ అభివృద్ధి అధికారిని రసగ్న మాట్లాడుతూ, పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, అందువల్ల ప్రజలు తమ వంతుగా పంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్య స్థాపనకు సహకరించాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ రాజుపాలెం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**

సియస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో జాతిపీత మహాత్మా గాంధీజీ 157 వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా కళాశాల డీన్ డాక్టర్ కె.మోష కళాశాల సిబ్బంది తో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో మహాత్మా గాంధీజీ ఎంతో కీలక భూమిక పోషించారని అన్నారు. అయన చూపిన అహింస, సత్యం మార్గాలను మనమంత అనుసరించి సమాజంలో సానుకూల మార్పు తీసుకోచ్చే విధంగా సాగలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# డీఏ బకాయిల సాధన కోసం నిరాహార దీక్ష

**ఏపీటీఎఫ్ నాయకుల మద్దతు**



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**

సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో కొనసాగుతున్న నిరాహార దీక్ష కార్యక్రమానికి ఏపీటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ సి యస్ పురం నాయకులు బి. చిన్న నారాయణ, వహీద్, షేక్ ఖాజా మస్తాన్, ఎన్. గంగాధర్ తదితరులు నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి, ఉద్యోగుల న్యాయమైన ఆర్థిక హక్కులను పరిరక్షించాలని వారు కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలకు ఏపీటీఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు.సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర ఆర్థిక సమస్యలను కూడా పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా అంగన్వాడి ఉత్సవం, గాంధీ జయంతి

**కృష్ణాజిల్లా, పెన్ పవర్ అక్టోబర్ 2**

అవనిగడ్డ నియోజకవర్గం, ఘంటసాల మండలం, గోగినేని పాలెం గ్రామంలో ఘనంగా అంగన్వాడి ఉత్సవం, గాంధీ జయంతిని నిర్వహించారు. పంచాయితీ రాజ్ సంబంధిత అధికారులు అత్తూరి గోపీచంద్, యార్లగడ్డ శివరాం ప్రసాద్,యం సుజాత, గ్రామ పెద్దలు ఘట్టమనేని రుక్మిని, కూటమి పార్టీ నాయకులు ఆంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ మాట్లాడుతూ అంగన్వాడి విద్యార్థులకు సంబంధించి వివరణ అందించారు. అదేవిధంగా గాంధీజీ గురించి చెప్పారు. అందులో భాగంగా సంబంధించిన అంగన్వాడి ఉపాధ్యాయురాలు కూడా మాట్లాడుతూ, పిల్లలకు ప్రతిరోజు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు ఆటపాటలు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని స్పష్టం చేశారు. పిల్ల తల్లులు కూడా పాల్గొని విజయవంతం చేశారు.

# రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యానవన రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## పంటల మార్పిడి అవసరం -రాబోవు కాలంలో గిద్దలూరు సస్యశ్యామలం కాబోతోంది

## సెకండ్ పేజ్ లో గిద్దలూరు కు వెలుగొండ జలాలు -ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 02**

రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యానవన రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గ్లోబల్ హార్టీకల్చర్ హబ్ -- రైజింగ్ రాయలసీమ" మాస్టర్ ప్లాన్ కార్యక్రమాన్ని గిద్దలూరు పట్టణంలోని తిరుమల కన్వెన్షన్ హాల్‌లో రైతులతో కలిసి వీక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మదనపల్లిలో ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి 1,000 మందికి పైగా రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ రాజశ్రీ అధ్యక్షుత వహించారుముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించినారు ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యాన పంటల అభివృద్ధి, నీటి వనరుల కల్పన, ఆధునిక మార్కెట్ సదుపాయాల విస్తరణతో రాయలసీమ సమగ్ర అభివృద్ధికి రూ.1 లక్ష కోట్లతో రూపొందించిన ఈ ప్రణాళిక రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కీలక అడుగుగా నిలుస్తుందని మన ప్రాంతానికి ఇది సంతోషకరమైన రోజని అని ఎన్డీఏ కూటమి వెనుకబడిన ప్రాంతానికి జిల్లా ఇవ్వడం, ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారిక ప్రాంతశీ సాగునీరు అందిస్తూనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల్ల సారగారికి నీరు అందించిన అపర భగీరధుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఒంగోలు మార్కాపురం జిల్లాల అభివృద్ధికి 12 నియోజకవర్గాలను హార్టికల్చర్ హక్కులు పొందుపరచడం జరిగింది దీని ద్వారా మన ప్రాంతంలో ఉన్న వాతావరణ భూమి స్వభావం ఆధారంగా పంటలు వేయవచ్చు అని మన నియోజకవర్గంలోని ఆరు మండలాలు హార్టికల్చర్ హబ్ లో పామోలియన్ ఆయిల్ కు సంబంధించి పామాయిల్ తోటలు పెంపకానికి ఈ ప్రాంతాన్ని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేయడం జరిగిందన్నారు. మన రైతులు దాని వైపుకు



మరలితే మొక్కలు , కలుపులు తీయడం ఇతర పనులకు ప్రభుత్వం వైపు నుండి హార్టికల్చర్ శాఖ ద్వారా ఆర్థికంగా తోడ్పాటు అందించడం జరుగుతుందని ఈ ప్రాంతంలో ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, వీటితో 13 పైచిలుకు హెక్టార్లలో ఈ పంట వేయడం ద్వారా రైతులు సంవత్సరానికి 1800 కోట్ల రూపాయలు వారి ఉత్పత్తి అందుకోవచ్చు అని వెలుగొండ ప్రాజెక్టు ద్వారా మన నియోజకవర్గానికి లిఫ్ట్ ద్వారా 135 ఎకరాలు కాలువల ద్వారా 60 వేల ఎకరాలు మొత్తంగా 735 ఎకరాలకు వెలుగొండ ద్వారా నీరు అందుతుందని మన రైతులు పొలాలకు రోడ్లు చెక్ డ్యాములు చెరువుల రిపేరు అడుగగా 4500 కోట్ల రూపాయలతో 64 నియోజకవర్గాలకు నిధులు ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం జరిగిందని, మన నియోజకవర్గానికి 49 చెరువులకు 2020 కోట్ల రూపాయలు అంచనాలు ప్రభుతానికి పంపించడం జరిగిందన్నారు అతి త్వరలో ఈ నిధులు మంజూరు కానున్నాయి దీని ద్వారా మరమ్మత్తులు చేసుకోవచ్చని పూసలపాడు చెరువుకు 29 కోట్లు కొమరోలు చెరువుకు ఐదు కోట్లు ఇలా 48 చెరువులకు 2020 కోట్లు హార్టికల్చర్ కార్యాలయం ద్వారా పంపడం జరిగిందన్నారు. రహదారులకు 79 కోట్ల



రూపాయలు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని. గతంలో కొన్ని వందల చెక్ డ్యాములు మనం నిర్మించుకోగలిగాము దీని ద్వారా రైతులకు ఎంతో ఉపయోగ జరిగిందనని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యాన పంటలకు మెరుగైన సాగునీరు, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే రాయలసీమ రైతాంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతుల భాగస్వామ్యంతో రాయలసీమను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరపడి ఈప్రాంతనికి చెందిన రైతులు మీ పంట పొలాలు , అమ్ముకోవద్దని త్వరలో వెలుగొండ జలాలు రాబోతున్నాయని, పంట పొలాలు సస్యశ్యామలం కాబోతున్నాయని, రైతులు ప్రభుత్వ సూచనలు పాటించి పంటలు వేసుకోవాలని , వాతావరణ ప్రభావం వల్ల భూగర్భ జల నిక్షేపాలు అడుగంటి పోతు న్నామని నీరు పొదుపుగా వాడాలని, డ్రిప్ , స్ప్రింకర్లు వినియోగించుకోవాలని రైతులను జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు, ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు రైతులు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్వర్ ను పదవి నుంచి తొలగించాలి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 2**

భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను పదవి నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ రద్దు చేయాలని, ఎస్ఐఆర్ లో భాగంగా దేశవ్యాపితంగా 13 కోట్ల మందిని ఓటర్లు కాదంటూ ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకుని వారి ఓటు హక్కు పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీజీ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమీషన్ స్వయంప్రతిపత్తిని కాపాడాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకొని గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించి దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కాపాడాలని ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా రూపొందించడంలో అవకతవకలకు పాల్పడిన ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్వర్ ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, సీపీఐ నాయకులు మొగిలి వెంకటేశ్వర్లు, మంత్రు నాయక్, మహిళా నాయకురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా మా మొర వినుము... అంటూ జాతిపిత విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులు.

### వినూత్న పద్ధతిలో తమ సమస్యలు విన్నవించుకున్న ఉద్యోగులు.

### స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఆలోచన ప్రభుత్వానికి కల్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పణ





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 2**

మహాత్మా మా మొర ఆలకించి, మా సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి కల్పించాలని కోరుతూ స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులు శుక్రవారం మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతిని పురస్కరించుకొని స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కొమరోలులో వినూత్న పద్ధతిలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం స్వర్ణ వార్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు న్యాయమైన డిమాండ్ సాధనకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలు ఫలించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేర్కొంటూ తమ మొరను ఆలకించాలంటూ జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి ఐక్యవేదిక ప్రతినిధులు వినతి పత్రం సమర్పిస్తూ, జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం తాము నిరంతరం కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. అందువల్ల తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి కల్పించాలని వారు కోరారు. ఆ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ వార్డు ఐక్యవేదిక ప్రతినిధులు, స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

# రాచర్ల మండలంలో వై సి పి జండా ఎగురవేద్దాం

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబరు 02**

గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కుందురు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాచర్ల మండలం లోని 14 పంచాయతీ లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేద్దాం. అని రాచర్ల వై సిపి అధ్యక్షులు సి ఆర్ ఐ మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం రాచర్ల మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి ఆర్ ఐ మురళి ఆధ్వర్యంలో మండలంలోని 14 పంచాయతీ పరిధిలోని ముఖ్య నాయకులు అందరూ కలిసి సమావేశం నిర్వహించారు , రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీ లో బూతు లెవెల్ స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభ్యర్థులు,ఖరారు చేయడం , వర్గాలు లేకుండా అందరూ యూనిటీ గా ఉండి మండంలోని ఎంపీపీ, జడ్పీటీసీ,అన్ని సర్పంచ్ లు, ఎంపీటీసీ లు గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం అని కోరారు ఈ కార్యక్రమంలో 14 పంచాయతీ లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు భారీ గా హాజరుఅయ్యారు .



# స్వర్ణ కొమరోలు లో ఘనంగా జాతిపిత జయంతి వేడుకలు

### మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత కార్యదర్శులు

### స్వర్ణ కొమరోలు రెండు కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కార్యదర్శి జనార్దన్ రెడ్డి సిబ్బంది





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 2**

మహాత్మా గాంధీ జాతిపిత 157 వ జయింతిని పురస్కరించుకొని శుక్రవారం స్వర్ణ కొమరోలు లో జాతిపిత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా స్వర్ణ కొమరోలు 1 ప్రాంగణంలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి కొమరోలు పంచాయితీ అభివృద్ధి అధికారిని వై గీత,స్వర్ణ కొమరోలు రెండు కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి తదితరులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆ సందర్భంగా డిడిఓ వై గీత మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్రాన్ని సాధించి పెట్టేందుకు జాతిపిత మహాత్మా గాంధీ చేసిన కృషి, సాగించిన పోరాటాలు, అహింసాయుత పద్ధతులు నేటికీ మరువరానివని, అందువల్ల మహాత్మా గాంధీ ఆశయాలైన గ్రామ స్వరాజ్యం, పరిశుభ్రత, పచ్చదనం, గ్రామీణాభివృద్ధి తదితర వాటి అమలుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో స్వర్ణ కొమరోలు ఒకటి, రెండు, మూడు సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆశా కార్యకర్తలు,పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్వర్ణ కొమరోలు రెండు లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.ఆ సందర్భంగా ఆయన మహాత్మా గాంధీ భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేశారు.స్వర్ణ కొమరోలు మూడు లో నిర్వహించిన కార్యక్రమంలో జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమాల అనంతరం స్వర్ణ కొమరోలు ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించారు.

# మహాత్ముడి ఆశయాలే సమాజానికి మార్గదర్శకం





**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 2**

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణంలోని గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన వేడుకల్లో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్నా రాంబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ సాగించిన అహింసా పోరాటం, సత్యనిష్ఠ, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను ప్రజా జీవితంలో ఆచరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన ఘన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**జంకే నివాసంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు..**

మహాత్మా గాంధీ ఆశయాలు, ఆయన చూపిన అహింసా మార్గమే నేటి సమాజానికి మార్గదర్శకమని మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంటు పరిశీలకులు జంకే వెంకటరెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మార్కాపురంలోని ఆయన నివాసంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జంకే వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. అహింస, సత్యాగ్రహం, సత్యం, శాంతి మార్గాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహనీయుడు గాంధీజీ అని పేర్కొన్నారు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లబోతుల కొండయ్య, గౌస్ మొహిద్దీన్, వేంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుందురు శ్రీనివాసరెడ్డి, సుభారెడ్డి, అయూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**జనసేన నేతల నివాళులు..**

మార్కాపురం జనసేన పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశ స్వాతంత్ర్యోద్యమానికి చేసిన సేవలను, ఆయన ఆచరించిన సత్యం, అహింసా సిద్ధాంతాలను నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు విజయరావు నరసింహారావు, సిరిగిరి శ్రీనివాసరావు, పిన్నెబోయిన శ్రీనివాసరావు, వీరిశెట్టి శ్రీనివాసులు, మట్టం శ్రీనివాసులు, చాబోలు ఫణి, మిరియాల వాసవి తదితరులు పాల్గొన్నారు.

# ఓ మహాత్మా.. మా మొర వినుమా"

### గాంధీజీకి వినతిపత్రం.. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**

గిద్దలూరు మున్సిపాలిటీ స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్లు పరిష్కరించాలని .. "మహాత్మా మా మొర వినుమా"" అంటూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గాంధీజీ విగ్రహానికి అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధి కాశీ రమణ మాట్లాడుతూ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ప్రొబేషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి కనీస మూలవేతనం రూ.30 వేలుగా నిర్ణయించడంతో పాటు స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ కల్పించాలని కోరారు. అలాగే జీవో నంబర్ 11ను వెంటనే రద్దు చేయాలని, ఉద్యోగులపై అదనపు పని భారం పెంచుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ వార్డుకు చెందిన ఉద్యోగులు శశిధర్, మౌనిక, తేజస్విని, కళావతి, సాయి, ప్రవీణ్, విమల తదితరులు పాల్గొన్నారు.

# దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవంలో ప్రత్యేక దువాలో

### ముత్తుముల క్రిష్ణ కిశోర్



**గిద్దలూరు: పెన్ పవర్ అక్టోబర్ 02**

పట్టణంలోని శ్రీ హజరత్ దస్తగిరి (మఖుసుభాని) స్వామి వారి దర్గా షరీఫ్‌లో నిర్వహించిన 7వ ఉరుసు మహోత్సవం సందర్భంగా పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహాన్ షా వలి కోరిక మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు దర్గా వద్ద ప్రత్యేక దువా నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందజేశారు ఈ సందర్భంగా క్రిష్ణ కిశోర్ రెడ్డి స్వయంగా భక్తులకు అన్నశీ వడ్డించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించినారు అనంతరం దర్గా వారు ఏర్పాటు చేసిన సాంస్కృతిక నృత్యాలు తిలకించారు క్రిష్ణ కిశోర్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, ఐక్యతతో మెలగడం ఎంతో సంతోషకరమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పల్లె శ్రీనివాస్ రెడ్డి, బద్రి భాషా, నాయబ్ ఖాజా, షేక్ మహమ్మద్ రఫీ, లొక్కు రమేష్, మండ్ల శ్రీనివాసులు, అబ్బు ఒబయ్య, చందు భాషా, కూటమి నాయకులు, కార్యకర్తలు, దర్గా నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# గుడ్లూరు గ్రామసభలో మహనీయులకు ఘన నివాళులు



## పంచాయితీ అభివృద్ధిపై గ్రామసభలో ప్రత్యేక చర్చ.

## పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చిన జనసైనికులు.



**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబర్ 02:**
మండల కేంద్రమైన గుడ్లూరులో జరిగిన ప్రత్యేక గ్రామసభలో మహనీయులైన లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ ల జయంతిని పురస్కరించుకొని వారిరువురికి గుడ్లూరు మండల జనసైనికులు ఘన నివాళులు అర్పించారు. మండల అభివృద్ధి అధికారి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక గ్రామసభలో కూటమి లోని టీడీపీ,బీజేపీ నాయకులతో పాటు జనసైనికులు మూలగిరి శ్రీనివాస్, అన్నంగి చలపతి తదితరులు పాల్గొని గ్రామంలోని పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మూలగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు గడిచినా గ్రామంలో మౌలిక సమస్యలు ఉండటాన్ని ప్రస్తావించారు. గ్రామంలో అస్తవ్యస్తమైన డ్రైనేజీ వీధివీధినా తారసపడుతుందని ఇది పారిశుధ్యం నిర్వహణ లోపాన్ని చూపిస్తున్నదని అన్నారు. సక్రమమైన డ్రైనేజీ లేకపోవడం వల్ల వీధులన్నీ వర్షాలు లేకుండానే మురుగు మయంగా దర్శనమిస్తున్నాయన్నారు. పంచాయతీ రహదారుల దురాక్రమణ అరికట్టాలని ముఖ్యంగా గుడ్లూరు మెయిన్ రహదారి దురాక్రమణలకు గురై ఎదురెదురుగా రెండు బస్సులు వెళ్ళలేని పరిస్థితి దాపురించినదని అన్నారు. దీనివల్ల ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. జలజీవన్ మిషన్ ఫలాలు ప్రజలందరికీ అందేలా ప్రతి ఇంటికి 50 లీటర్ల తాగునీరు సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. వీధిలైట్లు సక్రమ నిర్వహణ క్రమశిక్షణగా ప్రణాళికా బద్ధంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువలు గట్లు వద్ద ఉన్న పంచాయతీ భూముల్లో పార్కులు అభివృద్ధి చేయాలన్నారు. గ్రామ అభివృద్దిలో ప్రజలను చైతన్యపరిచి పాలనలో బాధ్యతయుత భాగస్వామ్యం కల్పించాలన్నారు. ఈ అంశాలను గ్రామ సభ ద్వారా పరిశీలించి సమస్యలు పరిష్కారయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. అలాగే గ్రామ సభ ద్వారా పంచాయతీలకు అన్ని విధాలా సహకరిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. కూటమి రథ సారధి విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కొనసాగుతున్న మంచి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరిగే నిర్ణయాలే ఉంటాయని గ్రామ సభ అందరికీ తెలియాలన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా నిజాయితీ నిబద్ధత తో పాలనలో పారదర్శకత కోసం క్షేత్ర స్థాయిలో సమూల మార్పులు ఆశించి పంచాయతీ రాజ్ శాఖను తీసుకున్న పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పంచాయితీలు మరింత అభివృద్ధి చెందాలన్నారు . ఈ గ్రామ సభ ద్వారా సీఎం డిప్యూటీ సీఎం లకు కూడా ధన్యవాదాలు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ కాలంలో 24 వ స్థానంలో ఉన్న పంచాయతీ వ్యవస్థను నేడు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలోకి తీసుకుని వచ్చిన నిబద్ధత పనిచేసిన ఘనత పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు దక్కుతుందని, వారికి కూడా ఈ గ్రామ సభ ద్వారా ధన్యవాదాలు. అలాగే రాబోయే రోజుల్లో కూటమి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో గుడ్లూరు పంచాయతీని ఆదర్శ పంచాయతీగా నిలిచేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన టీడీపీ బీజేపీ నాయకులకు ప్రజలకు మరీ ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

# 14 కుటుంబాలు టిడిపిలో చేరిక

## ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో పార్టీలో చేరిన గొల్లపాలెం వాసులు





**లింగసముద్రం పెన్ పవర్, అక్టోబర్ 2**
లింగసముద్రం మండలం ఆర్ఆర్ పాలెం పంచాయతీలోని గొల్లపాలెం గ్రామంలో వైసిపికి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 14 కుటుంబాల వారు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కందుకూరులోని టిడిపి కార్యాలయంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. గొల్లపాలెంకు చెందిన బోడి వెంకటేశ్వర్లు, వెంకట నరసింహం, మాల్యాద్రి, దేగా మధు, నరసింహం, డబ్బుగొట్టు మాలకొండయ్య, చెలికల కొండలరావు, చిన్నకోటయ్య, మణికంఠ, మల్లికార్జున, పందిళ్ళ శ్రీను, చావకాల ఒక్కియ్య, మితుమళ్ళ మల్లికార్జున, రమేష్ కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అద్భుతమైన పనితీరు, అభివృద్ధికి ఆయన పడుతున్న కష్టం, తీసుకొస్తున్న నిధులు, గ్రామాలు బాగుపడుతున్న తీరును చూసి, తామంతా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలు, కొత్తగా చేరిన వారు... కలిసి పనిచేసి రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకురాలు ఎం. శ్రావణి రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి వంకాయలపాటి మాల్యాద్రి, గ్రామ టిడిపి అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు కిలారి రవిబాబు, రామారావు, కేతినేని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జైలు జీవితం శిక్ష కాదు మంచి శిక్షణ

**- 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి టి. రాజ్యలక్ష్మి**

**- జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం..**

**గాంధీ జయంతి వేడుకలు**

**- పాల్గొన్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, సీనియర్ సివిల్ జడ్జి-కమ్-సెక్రటరీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వెంకట రామకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకట రమణ, ఒంగోలు జిజిహెచ్ ఇన్చార్జ్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్**






**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 02**
జైలు జీవితం కేవలం శిక్షను అనుభవించే కాలం మాత్రమే కాకుండా, తమను తాము మార్చుకుని మంచి భవిష్యత్తును సానుకూలంగా నిర్మించుకునే శిక్షణ గా ఉపయోగించుకోవాలని 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి టి. రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా జైలు, ఒంగోలులో గాంధీ జయంతి వేడుకలను ఖైదీల సంక్షేమ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి టి. రాజ్యలక్ష్మి, జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, సీనియర్ సివిల్ జడ్జి-కమ్- సెక్రటరీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వెంకట రామకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకట రమణ, ఒంగోలు జిజిహెచ్ ఇన్చార్ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, చీమకుర్తి డాక్టర్ బి. జవహర్, శ్రీ శివాని ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహిత్ మోహన్ పాత్ర హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖైదీలను ఉద్దేశించి అతిథులు ప్రసంగిస్తూ క్రమశిక్షణ, ఆరోగ్యం, విద్య, న్యాయ అవగాహన, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, సంస్కరణ, పునరావాసం వంటి అంశాలపై విలువైన సందేశాలను అందించారు. ఖైదీలలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన క్రీడలు, ఆటలు, వ్యాసరచన, ఇతర సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన ఖైదీలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శిక్షతో పాటు సంస్కరణ - సంస్కరణతో పాటు పునరావాసం పునరావాసంతో సమాజంలో గౌరవప్రదమైన పునఃప్రవేశం అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎం. రాజ్ కుమార్, జైలర్ మజ్జి అప్పల నాయుడు, డిప్యూటీ జైలర్ మల్లికార్జున రెడ్డి, ఇతర అధికారులు, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాచర్ల ఎం.ఇ.ఓ 2 గా ఎం.వి భాస్కర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**గిద్దలూరు, పెన్ పవర్ అక్టోబరు 2**
రాచర్ల మండల విద్యాధికారి 2 గా ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తుముల విజయభాస్కర్ రెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటిదాకా ఎం.ఇ.ఓ 2 గా వ్యవహరిస్తున్న వారణాసి గిరిధర శర్మకి పదోన్నతి లభించడంతో ఈ నియామకం అవసరమైంది. దీంతో విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల యు.టి.ఎఫ్ బృందం ఆయనను అభినందించింది.



# ఓ మహాత్మా మా మొర ఆలకించు

## మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చిన ఉద్యోగులు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 2**
ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డుల ఉద్యోగులు వినూత్న రీతిలో గాంధీ జయంతి రోజు మహాత్మా మా సమస్యలు ఆలకించు అంటు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా యు డబ్ల్యూ జి ఈ ఎ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామావత్ మంత్రు నాయక్, జిల్లా కోశాధికారి రామావత్ ఫణి రాజ్ నాయక్ లు మాట్లాడుతూ ఎస్ జి ఎస్ డబ్ల్యూ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను వెంటనే మంజూరు చేయాలని,ప్రొఫెషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, ప్రొబేషన్ ఆలస్యమైన కాలానికి ఒక వార్షిక ఇంక్రిమెంట్ను మంజూరు, ప్రతి ఉద్యోగికి కనీస మూల వేతనం 30 వేలకు తగ్గకుండా నిర్ణయించడంతో పాటు స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ కల్పించాలని,జీవో ఎంఎస్ నెంబర్ 11ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. అలాగే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రావలసిన అన్ని ప్రయోజనాలకు మూడు నెలల లోపు అందించి అర్హతమేరకు కుటుంబంలోని ఒకరికి కారుణ్య నియామక ప్రక్రియ పూర్తి చేయాలని,జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో ఎస్ జి ఎస్ డబ్ల్యూ ఉద్యోగ సంఘాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, ఎస్ జి ఎస్ డబ్ల్యూ ఉద్యోగులపై అదనపు పని భారం పెంచుతున్న డిప్యూటేషన్ను వెంటనే రద్దు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని,బిఎల్ఓ విధులను సచివాలయ ఉద్యోగులకు మాత్రమే కాకుండా అర్హత ఉన్న ఇతర శాఖల ఉద్యోగులకు కూడా సమానంగా కేటాయించాలని,ఇద్దరి అసోసియేషన్ లీడర్స్ యొక్క సస్పెన్షన్ ఆర్డర్ ను తీసివేసి,అక్రమంగా 46 మంది మీద కేసులు బుక్ చేసిన వాటిని ఉపసంహరణ చేసుకోవాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఎస్ జి ఎస్ డబ్ల్యూ ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన మిగిలిన ఉద్యోగ



సర్వీసు,ఆర్థిక సంబంధిత సమస్యలపై పరిష్కారం చూపాలని డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని,ఐక్యవేదిక కార్యాచరణ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎస్ టియు ఆధ్వర్యంలో అశోక్ బాబు మొదట వర్ధంతి కార్యక్రమం






**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 2:**
శుక్రవారం కందుకూరు స్థానిక బాలుర హైస్కూల్ నందు ఎస్ టి యు నాయకులు అశోక్ బాబు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ వర్ధంతి సభకి కాపులూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వై అశోక్ బాబు సంఘం కోసం పోరాడుతూ చనిపోయే రోజు కూడా ఫ్యాక్టర్కు సంబంధించి కరపత్రాలు పంచటానికి సింగరాయకొండలతో ఇదే రోజు రోడ్డు ప్రమాదం ద్వారా మనల్ని వదిలిపెట్టి వెళ్ళారని ఆయన అన్నారు. ఎస్ టి యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సిహెచ్ ఆదినారాయణ మాట్లాడుతూ కామ్రేడ్ అశోక్ బాబు మంచి ఆదర్శవంతమైన ఉపాధ్యాయ నాయకుడిగా సంఘం అభివృద్ధికి ఎంతగానో కృషిచేసి ఈరోజు మనల్ని వదిలిపెట్టి వెళ్లి సంవత్సరం అయినా సందర్భంగా ఆయనను గుర్తు చేసుకుంటూ ఈ మొదటి వర్ధంతి కార్యక్రమం జరుపుతున్నామని. ఆయన లేని లోటు సంఘంలో స్పష్టంగా ఆగుపడుతుందని అంతటి కష్టపడే నాయకుడిని కోల్పోవడం మన దురదృష్టం అని ఆయన అన్నారు. ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అశోక్ బాబు ఈ ప్రాంతంలో ఎస్టియు సంఘం అభివృద్ధికి పాటుపడుతూ ఉపాధ్యాయులకు నోట్లో నాలికలాగా వ్యవహరించే వారిని ఏ సమస్య వచ్చిన ఎప్పుడు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేవాడని ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ మనకు దూరం అవటం చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి శివశంకర్, ఎంఈఓ గోవిందయ్య, ప్రధానోపాధ్యాయులు బీరకాయల మాధవరావు, ఎస్ టి యు సీనియర్ నాయకులు ముల్లూరి మల్లికార్జున, రాష్ట్ర కౌన్సిలర్ దద్దగుంట వెంకటేశ్వర్లు, పథకమూరి కృష్ణయ్య, ఎస్ టి యు నాయకులు మేకల మోహన్రావు, జి శ్రీహరి, యు శ్రీనివాసులు, వేల్పుల రమేష్, ఎస్ వి సునీల్ కుమార్, మార్కాపురం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే నాయబ్ రసూల్, యుటిఎఫ్, బిటిఎ, అశోక్ బాబు కుటుంబ సభ్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# భజన గురువు సమ్మన శ్రీనివాసులకు ధార్మిక పురస్కారం

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**
సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెంచలకోన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహించిన ధార్మిక శిక్షణ కార్యక్రమంలో సి.ఎస్.పురం గ్రామానికి చెందిన భజన గురువు సమ్మన శ్రీనివాసులు ఆత్మీయ ధార్మిక పురస్కారం అందుకున్నారు. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన భజన గురువులకు నిర్వహించిన ధార్మిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా




శ్రీనివాసులను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ధార్మిక, భజన కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న సేవలను గుర్తించి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసులను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం గ్రామస్తులు, భజన బృందాల సభ్యులు శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.

# గాంధీజీ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

## మహాత్ముని సేవలను స్మరించుకున్న జేసీ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 02**
జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గిద్దలూరులో ఆయన చిత్ర పటానికి జిలా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి అందించిన సేవలను, సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్య పరిరక్షణ -పత్తి రామమూర్తి

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**
గ్రామాలను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రాష్ట్ర ఆరోగ్య ప్రముఖ్ పత్తి రామమూర్తి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అయ్యలూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని జినుగువారిపల్లి గ్రామంలో గ్రామ వికాస్-గ్రామ స్వచ్ఛత, గ్రామ ఆరోగ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్ల వెంట పెరిగిన పిచ్చి చెట్లను తొలగించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పత్తి రామమూర్తి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. గ్రామ స్వచ్ఛత ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా అభివృద్ధి చెందితేనే దేశం కూడా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పత్తి రామమూర్తి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా -మాదినేని లక్ష్మణ్





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**

పాఠశాల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఎస్.పురం మండల పరిషత్ ఆదర్శ పాఠశాల (ఎస్టీ) నూతన ఎస్ఎంసీ చైర్మన్ మాదినేని లక్ష్మణ్ అన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ గా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్, వైస్ చైర్మన్ గా మేకల లక్ష్మీకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్కీపోగు ఆంటోని ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తూ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి అవసరమైన అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారిస్తామని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడికను అలవర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పాఠశాల అభివృద్ధి ఒక్కరి బాధ్యత కాదని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు సమష్టిగా పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు హెచ్ఎం లక్కి పోగు ఆంటోని మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యార్థుల హాజర్ విద్యా ప్రగతి క్రమశిక్షణపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని అన్నారు పాఠశాల అభివృద్ధి మరియు విద్యార్థుల అవసరాలను గుర్తించి నూతన కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై టీడీపీ కట్టుబడి ఉంది

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**

ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలన్న విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని జీవో నెం.105, 1065 జారీ చేస్తే, ఎన్నికలు జరగకూడదు, బీసీలకు రిజర్వేషన్ దక్కకూడదనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో 34శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేశారని, ఆనాడు బీసీలకు 34శాతం ఇవ్వకపోవడం వల్ల 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని, ఇప్పుడు కూడా అదే కుట్రతో పదవులు రాకూడదని సిగ్గులేకుండా కోర్టుకు వెళ్లారని విమర్శించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే కుట్రతోనే గొడ్డలి పార్టీ నేతలు పిటిషన్లు వేసి తీరని ద్రోహం చేశారని అన్నారు. అన్ని వర్గాల హక్కులను కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తుంటే, బీసీలకు అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయాలనే ఎజెండాతో, వెనుకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూడాలనే కుట్రతో గొడ్డలి పార్టీ నీచ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల్లో 34శాత రిజర్వేషన్ కల్పించాలన్న తమ సంకల్పం మారదని, బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామని, హైకోర్టు తీర్పును గౌరవిస్తూ న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించి బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం రిజర్వేషన్ల అంశం మాత్రమే కాదని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యమని, 34శాతం రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి 1987లో 20 శాతం 1995లో 34శాతం రిజర్వేషన్లు కల్పించింది టీడీపీనేనని, బీసీలకు రాజకీయ సాధికారత అనేది టీడీపీ డీఎన్ఏలోనే ఉందని, బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని, సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీల అభ్యున్నతి కోసం ఇచ్చిన మాటపై ఎక్కడా వెనక్కి తగ్గబోమని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్పష్టం చేశారు .

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## -109 మందికి 60.68 లక్షలు సహాయం అందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 2**

వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం వరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారినా సరే... ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్కువగా నిధులు ఇస్తున్నారు. పేదల తరపున ఆయనకు కృతజ్ఞతలు అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని 109 మంది లబ్ధిదారులకు 60.68 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం అందజేశారు. కందుకూరు అర్బన్ పరిధిలో 28 మందికి 10.68 లక్షలు, కందుకూరు మండల పరిధిలో 36 మందికి 16.24 లక్షలు, వలేటివారిపాలెం మండల పరిధిలో 35 మందికి 13.72 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. అలాగే అత్యవసర వైద్య సహాయం కోసం10 మందికి 20.03 లక్షల సహాయాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 44 వ విడతగా ఈ వైద్య సహాయాలను అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు విడుదలవుతున్నాయని చెప్పారు. ప్రజలు కోరుకుంటున్నట్లుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుంది.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. స్త్రీ శక్తి, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు తదితర పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు ఎం. శ్రావణి రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు



దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, ఏఎంసి డైరెక్టర్ కొత్తూరి వెంకట సుధాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, రాష్ట్ర నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, రమణయ్య, నరేంద్ర, షేక్ రూబీ, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా తెరచాటు రాజకీయాలకు చెంపపెట్టు

**-మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టుతీర్పు ప్రజావిజయం-రాబోయే ఎన్నికలు మా అభివృద్ధికి రెఫరండం**

**-అభివృద్ధికి అడ్డుపడ్డ వారికి గుణపాఠం చెప్పండి -కూటమి అభ్యర్థులను గెలిపించండి**

**-అక్రమ కేసులు, కక్ష సాధింపులు నాకు తెలియదు-రండి... మీడియా సమక్షంలో నేనుచేసిన అభివృద్ధి చూపిస్తా**

**-వైసిపి విమర్శలకు ఎమ్మెల్యే ఇంటూరి చాలెంజ్**



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 2**

కందుకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కందుకూరు ప్రజల ఆకాంక్ష నెరవేరింది. మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజా విజయం. అభివృద్ధిని అడ్డుకోవాలన్న కొందరి కుట్రలకు ఈ తీర్పు గుణపాఠం అని అన్నారు. రాజ్యానికి ఒకేరాజు ఉండాలన్నది కొందరి కోరిక. గోడచాటు రాజకీయాలతో అప్పట్లో పిటిషన్ వేయించారు. 14 సంవత్సరాలుగా ఎన్నికలు జరగకుండా అడ్డుకున్నారు. ఇటీవల ఇంప్లీడ్ పిటిషన్లు కూడా వేయించారు. కానీ చివరకు న్యాయమే గెలిచింది. ఎన్నికలు అడ్డుకోకుండా ఉంటే... ఈపాటికి కోట్ల రూపాయల నిధులు వచ్చి ఉండేవి, సుమారు 100 మంది కౌన్సిలర్లు అయ్యేవారు అని అన్నారు. కొందరిపై అక్రమ కేసులు పెట్టించానని వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అక్రమ కేసులు, కక్ష సాధింపులు నాకు తెలియదు. ఆ అవసరం నాకు లేదు. ప్రజలకు సుపరిపాలన అందించడమే నా ఏకైక లక్ష్యం అని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఈ రెండున్నరేళ్లలో 179 కోట్లతో అభివృద్ధి పనులు చేసాం. 274 రోడ్లు నిర్మించాం. ఎన్నో ఏళ్లుగా, ఎవరూ చేయలేని రోడ్ల వెడల్పు, భూ సమస్యలు పరిష్కరించాం. కొత్తగా వచ్చిన హెచ్ఏఎం పథకం క్రింద మరో 39 కోట్లు మున్సిపాలిటీకి రాబోతున్నాయి అని అన్నారు. పల్లె పండుగ ద్వారా 17.79 కోట్లతో నియోజకవర్గంలో కొత్తగా తారురోడ్లు నిర్మించాం. తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ మెజారిటీ రాని గ్రామాలలో కూడా అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రెండేళ్లలో మరింత అభివృద్ధి చేస్తాను. తాజాగా హార్టికల్చర్ హబ్ ద్వారా నియోజకవర్గానికి 100 కోట్ల నిధులు రాబోతున్నాయి. సహకరిస్తున్న ముఖ్యమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ నాయకుడు ఒకరు, అభివృద్ధిపై ఏదేదో మాట్లాడుతున్నారు. వీలు చూసుకుని రమ్మనండి. మేము ఏమి అభివృద్ధి చేసామో, మీడియా సమక్షంలో అన్నీ చూపిస్తాం. వైసీపీ ప్రభుత్వంలో ఏమి చేశారో కూడా చర్చిద్దాం అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే... మున్సిపల్ ఎన్నికలకు రెఫరండం. కోర్టులో కేసులు వేయించి, అభివృద్ధికి అడ్డుపడ్డ పార్టీని చిత్తుగా ఓడించండి. ఆ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పండి. అదే సమయంలో, చిత్తశుద్ధితో పనిచేస్తున్న మా కూటమి అభ్యర్థులను గెలిపించండి అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం. మా పార్టీకి బీసీలే వెన్నుముక. వారికి రాజకీయంగా అవకాశం కల్పించిన పార్టీ తెలుగుదేశం. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని గమనించి, స్థానిక ఎన్నికల్లో మాకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాను అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. కేసుల నుంచి విముక్తి కల్పించి, కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించే విషయంలో కృషి చేశారంటూ.... పట్టణ పార్టీ నాయకులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, నాదెండ్ల వెంకటరమణయ్య, నరేంద్ర, రాయపాటి శ్రీనివాసరావు, కొత్తూరి సుధాకర్, అల్లం వెంకటేశ్వర్లు, షేక్ సలాం, షేక్ రూబీ, తలమంచి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు అర్బన్ కాలనీలో కార్డన్ సెర్చ్

**70 ఇళ్లలో తనిఖీలు..**

**24 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు స్వాధీనం**



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 02**

గిద్దలూరు పట్టణంలోని అర్బన్ కాలనీలో జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అర్బన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు కాలనీలోని 70 గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనాలకు సరైన పత్రాలు చూపించిన అనంతరం వాటిని విడుదల చేస్తామని అర్బన్ సీఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడటమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గంజాయి సేవించడం వలన కుటుంబాలు కూడా విచ్ఛిన్నం అవుతాయి. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, స్వశక్తితో ఎదిగి సమాజానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అర్బన్ కాలనీలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చినా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని సీఐ సురేష్ తెలిపారు.

# మీడియాపై దాడులు ఆపండి

**మీడియా కమిషన్ ఏర్పాటు చేయండి -నాలుగో స్తంభాన్ని కాపాడండి**

**గాంధీ విగ్రహం చేతిలో జర్నలిస్టులో వినతి పత్రం**

**ఏపీయూడబ్ల్యూజే ప్రదర్శనలో జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రమణ డిమాండ్**







**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 2**

జర్నలిస్టులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రమణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన మార్కాపురంలో శు క్రవారం జర్నలిస్ట్ డిమాండ్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక ప్రెస్ క్లబ్ నుండి పాత బస్టాండ్ లోని గాంధీ పార్క్ వరకు ప్రదర్శనగా వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గాంధీ విగ్రహం చేతిలో ఉంచారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రమణ మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో మీడియా పైన, లౌకిక శక్తులపైన దాడులు తీవ్రతరమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా మూలాలు దెబ్బతింటే అది దేశ పురోగతికి, ప్రజాస్వామ్య వ్యవస్థకే తీవ్ర నష్టమన్నారు. అంతర్జాతీయంగా పత్రికా స్వేచ్ఛలో భారతదేశం కనిష్ట స్థాయికి పడిపోయిందన్నారు. జర్నలిస్టుల వేతనాలు, వృత్తి భద్రతకు సంబంధించి మజీదియా కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి అందించి దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్యన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న వేతన బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ నివాస స్థలాలను మంజూరు చేయాలని, జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని అమలుపరచాలని కోరారు. 60 ఏళ్లు నిండిన జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, రైల్వేలో 50 శాతం ప్రయాణ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బంకా శ్రీనివాసరావు, మాజీ ఐజేయూ సభ్యులు జి.ఎల్.నరసింహారావు, కోశాధికారి డి.బాబీ, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె.బాజీవలి, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె.అన్నూ, జి.రమేష్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి.ఓబయ్య, నాయకులు వేసపోగు రాజు, వి.వాసు, పవన్, ఎస్.కె.బషీర్, బి.మల్లికార్జున, సురేష్, ఆవుల వెంకట్, శేఖర్, నరేంద్ర, జి.మల్లికార్జునరెడ్డి, గుమ్మా అంకయ్య, ఏ.కృష్ణయ్య గౌడ్, ఎస్.కె.కరీం, థామస్, వై.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష





**పొన్నాలరు పెన్ పవర్ అక్టోబర్ 2**

పొన్నలూరు గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. సతీష్ బాబు డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని పి నాగమణి హాజరై గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, అంగన్వాడీ, పారిశుధ్యం, స్వచ్ఛ రథం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించి, ప్రజలకు అందుతున్న సేవలు, పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ ఇతర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. గ్రామసభలో చేపడుతున్న సంస్కరణలు వాటి ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రభుత్వ సేవలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. గ్రామసభ ప్రజల సమస్యలు, అవసరాలు అభివృద్ధి సూచనలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య వేదిక అని తెలిపారు.ప్రజలు గ్రామసభకు హాజరై తమ సమస్యలను తెలియజేసి, గ్రామ అభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పొన్నలూరు గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది మండవ మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# గాంధీజీ ఆశయాలను ఆచరించాలి

**టిడిపి పరిశీలకురాలు సుధా**





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 2**

జాతిపిత మహాత్మా : దేశానికి చేసిన సేవలు, స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను ఆచరించాలని కనిగిరి నియోజకవర్గ టిడిపి పరిశీలకురాలు సుధా అన్నారు మండల కేంద్రంలోని సి.ఎస్.పురం టిడిపి కార్యాలయంలో శుక్రవారం మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన గాంధీజీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీలకురాలు సుధా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆయన సేవలు భారత చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు.గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సామాజిక సమానత్వం వంటి విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని నాయకులు తెలిపారు. ఆయన ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా, నిత్య జీవితంలో ఆచరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలను యువతకు తెలియజేసి దేశభక్తి భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు అనంతరం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, కోనంగి వెంకట కొండయ్య, పునుగుపాటి రవికుమార్, బత్తుల వెంకటాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్ధవీడులో ఘనంగా గాంధీ జయంతి





**అర్ధవీడు , పెన్ పవర్ అక్టోబర్ 2**

జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు, స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర చిరస్మరణీయమని ప్రతి ఒక్కరూ గాంధీజీ ఆశయాలను ఆచరించాలని మండల అభివృద్ధి అధికారి అన్నారు. మండల కేంద్రమన అర్ధవీడు పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం గాంధీజీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్ధవీడు గ్రామపంచాయతీ నందు మహాత్మా గాంధీ జయంతి వేడుకలు మరియు స్టాట్యూటరీ గ్రామసభ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీ షేక్ ఖాసిం పీరా గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గాంధీజీ అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆయన సేవలు భారత చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సామాజిక సమానత్వం వంటి విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని నాయకులు తెలిపారు. ఆయన ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా, నిత్య జీవితంలో ఆచరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలను యువతకు తెలియజేసి దేశభక్తి భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామసభ కార్యక్రమానికి పంచాయతీ అభివృద్ధి అధికారి నారాయణ స్వామి, వి బి జి రామ్ జి, టెక్నికల్ అసిస్టెంట్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా భాగస్వామ్యం తోనే స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్, వికసిత్ భారత్

**- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి - స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు**










**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 02**

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రజలు తమ వంతు బాధ్యత నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్రలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 17 కేటగిరీలలో 65 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వచ్ఛత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యర్థాలను సేకరించి సరుకులు ఇచ్చేందుకు ప్రతి గ్రామానికీ స్వచ్ఛరథం వస్తుందన్నారు. వ్యర్థాలను ఇంధనంగా మార్చడం పైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ఒంగోలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెత్తను సంపదగా మార్చేందుకు ' గ్రీన్ గోల్డ్ ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చిన్ననాటి నుంచే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. అందుకే విద్యార్థుల కోసం హాస్టళ్లలో ' ముస్తాబు ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మంత్రి చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత తోనే మనకు గౌరవం లభిస్తుందన్నారు. గాంధీజీ గ్రామ స్వరాజ్యం, పరిశుభ్ర సమాజం కోసం కలలు కన్నారని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కల సాకారం అవుతుందన్నారు. గత నెలలో ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అదే విధానాన్ని ప్రజలు కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛతను తమ జీవన విధానంగా మార్చుకోవాలని అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. తద్వారా ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతమవుతుందన్నారు. అందుకోసమే ప్రతినెలా మూడవ శనివారం ' స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రియాజ్, సుచిత్ర మాట్లాడుతూ స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించారు. అవార్డు విజేతలకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి. వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిఆర్డిఏ, మెప్మా పీడీ నారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, మాజీ మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, మున్సిపల్ ఇంజనీర్ యెషయా, ఎంహెచ్ఓ వైష్ణవి, అధికారులు పాల్గొన్నారు.

**మై కలెక్టర్ యాప్ ఆవిష్కరణ**

జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా రూపొందించిన ' మై కలెక్టర్ ప్రకాశం ' మొబైల్ అప్లికేషన్ ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. దీని గురించి కలెక్టర్ వివరిస్తూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఈ యాప్ ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చు అన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా పి-4 కార్యక్రమానికి ఆర్థిక సహాయం కూడా చేయవచ్చన్నారు. ఈ విధంగా విరాళం ఇచ్చే డబ్బులు నేరుగా కలెక్టర్ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి అన్నారు. మెరుగైన సమాజ ఆవిష్కరణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఓటు హక్కు హరించే కుట్రను అడ్డుకోవాలి

**జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి**

**ఒంగోలులో వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ**

**ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల ఓట్లు తొలగించారని నేతల ఆరోపణ**




**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 02**

ఓటు హక్కు పరిరక్షణకు పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ అవసరమని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చూడాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించారంటూ వస్తున్న అభ్యంతరాలపై ఎన్నికల సంఘం బాధ్యత వహించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్ ను తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని నేతలు హెచ్చరిక చేశారు.ఈ మేరకు శుక్రవారం ఒంగోలులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలంటూ నినదించారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అద్దంకి బస్‌స్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బాపూజీ కాంప్లెక్స్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ పాత మార్కెట్, మిరియాలపాలెం, చర్చి సెంటర్ మీదుగా ప్రకాశం భవన్ వరకు సాగింది. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రకాశం భవన్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాస రావు సిపిఐ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా అనేది కేవలం పరిపాలనా రికార్డు కాదని, ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కుకు ఆధారమని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో కీలకమైనదని, అర్హులైన పౌరుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకుండా పోతే ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలుగుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించారనే అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 33 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని, మరో 32 లక్షల మందికి నోటీసులు ఇచ్చారంటూ ఆయన పేర్కొన్నారు. ఈ వివరాలపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల తొలగింపుపై బాధ్యతను నిర్ధారించాలని కోరారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు ప్రజలకు తగిన అవకాశం కల్పించాలని, నోటీసులు అందుకున్నవారు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు మాట్లాడుతూ సాధారణంగా ఓటర్ల జాబితాల సవరణలో కొత్త ఓటర్లను చేర్చడం, మరణించినవారి పేర్లను తొలగించడం వంటి ప్రక్రియలు జరుగుతాయని తెలిపారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడంపై ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. అర్హులైన ఓటర్లకు న్యాయం జరగాలంటే సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్. మోహన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించడం వల్ల అర్హులైన పౌరులు ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సీపీఐ(ఎంఎల్) నాయకురాలు ఎస్. లలితకుమారి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడానికి, తొలగించిన పేర్లను తిరిగి నమోదు చేయించుకోవడానికి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని విమర్శించారు. అర్హత ఉన్నప్పటికీ ఓటు హక్కుపై అనిశ్చితి ఏర్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్. వెంకట్రావు మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం ప్రాథమిక బాధ్యతని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని, అర్హులైన పౌరుల పేర్లు తొలగితే వాటిని తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు , సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, యంరమేష్, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, జి రమేష్, జె.జయంతి బాబు, బంకా సుబ్బారావు, యుఆదిలక్ష్మి, పి కల్పన, బి రఘురామ్, వి బాలకోటయ్య, కే.జీ మస్తాన్, ఎన్ వెంకటేశ్వర్లు, పల్లాపల్లి ఆంజనేయులు, జి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు టి ప్రభాకర్, ఇతర వామపక్ష నాయకులు పద్మ, ఎల్ రాజశేఖర్ వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యం

**- ఎమ్మెల్యే దామచర్ల**

**- 120 మంది లబ్దిదారులకు రూ.68 లక్షలు సిఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 02**

కూటమి ప్రభుత్వంలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకే తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు 68 లక్షల 12 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ పేదవాడు వైద్యానికి దూరం కాకూడదన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేల కోట్ల రూపాయలను సిఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరసన

**డిమాండ్స్ డేలో పాల్గొన్న ధర్మపురి సీనియర్ జర్నలిస్టులు**



**ధర్మపురి, పెన్ పవర్ అక్టోబర్ 02**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన డిమాండ్స్ డేలో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి వద్ద మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ధర్మపురికి చెందిన సీనియర్ జర్నలిస్టుల బృందం పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని ఈ సందర్భంగా జర్నలిస్టులు కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా జర్నలిస్టులు, ధర్మపురి సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.